www.vaarthavedhikasurya.com

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

విలేకరులు కావలెను:



వార్త వేదిక సూర్య దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని అన్ని జిల్లాల బ్యూరో, స్టాఫ్ రిపోర్టర్స్ మరియు నియోజక వర్గాల నుండి పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

పూర్తి వివరాలకు సంప్రదించగలరు.

సెల్: 9985389183, 7386949183

తెలంగాణ | పేజీలు: 08 | వెల: 5 | సంపుటి:01 | సంచిక: 66 | శనివారం | 28, డిసెంబర్ 2024 | ॥ ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి ॥

## అవినీతి వ్యతిరేక చర్యలపై వేగంగా స్పందించారు

- సమాజ సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చేవారు
- మన్మోహన్ మృతికి సంతాపం ప్రకటించిన అన్నా హజారే



**రాలేగావ్ సిద్ధి,డిసెంబర్27(వార్త వేదిక సూర్య):** మాజీ ప్రధాని దివంగత మన్మోహన్ సింగ్ మృతికి ప్రముఖ సామాజిక కార్యకర్త, అవినీతి వ్యతిరేక ఉద్యమ నేత అన్నా హజారే సంతాపం తెలిపారు. ఆయన అవినీతికి వ్యతిరేకి అని, లోక్‌పాల్, ఇతర అవినీతి వ్యతిరేక చర్యలకు వేగంగా

మిగతా 2లో..

## సిఫారసు లేఖలు పరిగణలోకి..


- ఫలించిన తెలంగాణ నేతల ఒత్తిడి
- సిఫార్స్ లేఖలు ఆమోదస్తామన్న టిటిడి
- వారంలో రెండురోజులు మాత్రమేనంటూ మెలిక



**తిరుమల,డిసెంబర్27(వార్త వేదిక సూర్య):** తెలంగాణలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు శుభవార్త చెప్పింది. వారానికి రెండు సార్లు తెలంగాణ నేతల సిఫార్సు లేఖలు అనుమతించాలని నిర్ణయం తీసుకుంది. శ్రీవారి

మిగతా 2లో..

## నిమ్స్‌లో ఓపీ సేవలు బంద్



**హైదరాబాద్, డిసెంబర్ 27(వార్త వేదిక సూర్య):** భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి దేశమంతా నివాళులర్పిస్తోంది. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రి కూడా మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించింది. అయితే మాజీ ప్రధాని మృతికి నివాళిగా శుక్రవారం ఓపీ(ఔట్ పేషెంట్) సేవలను నిలిపివేస్తున్నట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ బీరప్ప ప్రకటించారు. కేవలం ఎమర్జెన్సీ, క్యాజువలిటీ సర్వీసులు మాత్రమే పని

మిగతా 2లో..





# మన్మోహన్‌కు ప్రముఖుల నివాళి

- ఇంటికి వెళ్లి నివాళి అర్పించిన రాష్ట్రపతి ముర్ము
- ప్రధాని మోడీ, అమిత్ షా తదితరుల శ్రద్ధాంజలి
- కేబినేట్ భేటీలో ఘనంగా నివాళి
- వారంపాటు దేశంలో సంతాప దినాలు
- అధికారిక లాంఛనాలతో నేడు అంత్యక్రియలు
- ప్రధాన కార్యాలయాలపై జాతీయజెండా అవనతం

**న్యూఢిల్లీ,డిసెంబర్27(వార్త వేదిక సూర్య):** భారత మాజీ ప్రధాని, కాంగ్రెస్ సీనియర్ నేత మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా తదితర ప్రముఖులు నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మన్మోహన్ సింగ్ మృతిపై రాజకీయ, సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కన్నుమూయడంతో దేశ ప్రజలు శోక సంద్రంలో మునిగిపోయారు. ఆయన పార్థివదేహానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరంద్రమోదీ నివాళులర్పించారు. శుక్రవారం ఉదయం మన్మోహన్ నివాసానికి వెళ్లిన వీరు.. ఆయన భౌతికకాయం వద్ద అంజలి ఘటించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'ఆర్థికవేత్తగా, సంస్కరణల సారథిగా మన్మోహన్ సింగ్‌ను దేశం గుర్తుంచుకుంటుంది. ఆర్‌బీఐ గవర్నర్ సహా అనేక కీలక పదవుల్లో దేశానికి సేవలందించారు. పీవీ హయాంలో ఆర్థికమంత్రిగా దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చివేశారు. దేశం, ప్రజల పట్ల ఆయన సేవాభావం స్మరించుకోదగినది. విలక్షణ పార్లమెంటేరియన్‌గా ఆయన సేవలు అందించారు. ఎన్నో కీలక పదవులు చేపట్టినా నిరాడంబర జీవితం గడిపారు. జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ఆయనతో చాలాసార్లు మాట్లాడా. ఆయన మృతి విచారకరం. నా తరఫున, దేశ ప్రజల తరఫున శ్రద్ధాంజలి ఘటిస్తున్నా' అని మోదీ తెలిపారు.

మిగతా 2లో..

## ఆయన మరణం దేశానికి తీరని లోటు

- మన్మోహన్‌కు సోనియా, రాహుల్ నివాళి
- ఖర్గే తదితరులు శ్రద్ధాంజలి
- నేడు ఏఐసిసి కార్యాలయానికి పార్థివదేహం



**న్యూఢిల్లీ,డిసెంబర్27(వార్త వేదిక సూర్య):** భారత మాజీ ప్రధానమంత్రి, దేశ ఆర్థిక సంస్కరణల రూపకర్త మన్మోహన్ సింగ్ (92) పార్థివ దేహానికి కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ 'మన్మోహన్ సింగ్

మిగతా 2లో..



### మాజీ ప్రధాని, ఆర్థిక వేత్త మన్మోహన్‌కు

## సీఎం రేవంత్ నివాళి

### పార్థివదేహం వద్ద మంత్రులతో కలసి శ్రద్ధాంజలి

**న్యూఢిల్లీ,డిసెంబర్27(వార్త వేదిక సూర్య):** మాజీ ప్రధాని, ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్ పార్థివ దేహానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. సీఎంతోపాటు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, తెలంగాణ ఎంపీలు ఢిల్లీలోని మోతీలాల్ నెహ్రూ మార్గ్ వద్ద ఉన్న మన్మోహన్ సింగ్ నివాసానికి చేరుకున్నారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి డిమాండ్ చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం భారతదేశ ప్రజలకు తీర్చలేనటువంటి లోటన్నారు.

మిగతా 2లో..

- తెలంగాణతో ఆయనది ప్రత్యేక అనుబంధం
- రాష్ట్ర ఏర్పాటుకు సహకరించారని కెసిఆర్ ప్రకటన
- మన్మోహన్ అంత్యక్రియల్లో బిఆర్ఎస్ నేతలు
- ఘనంగా నివాళి అర్పించనున్న కెటిఆర్ బృందం
- కెసిఆర్ ఆదేశాలతో హస్తినకు పయనం



## మన్మోహన్ కేబినేట్‌లో పని చేయడం అదృష్టం

**హైదరాబాద్,(వార్త వేదిక సూర్య):** మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు భారత రాష్ట్ర సమితి నేతలు హాజరు కానున్నారు. భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, పార్టీ ఎంపీలు, ప్రతినిధులు నివాళులర్పించనున్నారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు హాజరు కావాలని కేటీఆర్, ఎంపీలను ఆ పార్టీ అధినేత ఆదేశించారు. ఆర్థిక

మిగతా 2లో..

## విచారణ వాయిదా

- అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్ విచారణ
- సోమవారానికి వాయిదా వేసిన కోర్టు
- వర్చువల్‌గా పాల్గొన్న బన్నీ



**హైదరాబాద్,(వార్త వేదిక సూర్య):** నటుడు అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్‌పై విచారణను నాంపల్లి కోర్టు సోమ వారానికి వాయిదా వేసింది. బెయిల్ పిటిషన్‌పై

మిగతా 2లో..



### కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై

## విచారణ వాయిదా

- 31 వరకు కెటిఆర్‌ను అరెస్ట్ చేయొద్దు
- ఫార్ములా ఈకార్ రేసింగ్ కేసు
- హైకోర్టులో విచారణ..31కి వాయిదా



**హైదరాబాద్,డిసెంబర్27(వార్త వేదిక సూర్య):** ఫార్ములా ఈకార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

మిగతా 2లో..

## న్యూ ఇయర్ గిఫ్టల పేరుతో మోసం

- సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- హెచ్చరించిన ఆర్టీసీ ఎండి సజ్జన్నార్



**హైదరాబాద్,(వార్త వేదిక సూర్య):** కొద్దిరోజుల్లో కొత్త సంవత్సరంలో అడుగుపెట్టబోతు న్నాము. అయితే కొత్త సంవత్సర వేడుకలపై సైబర్ కేటుగాళ్లు ఫోకస్ పెట్టారు. న్యూయర్ విషెస్ అంటూ అమాయకులను దోచుకునే ప్లాన్‌లో ఉన్నారు.

మిగతా 2లో..


మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

### నోరు తెరిస్తే సీఎం రేవంత్‌వి

## పచ్చి అబద్ధాలు

- బీసీల జనాభా ఎంతో తెలియకుండా రిజర్వేషన్ ఎలా ప్రకటిస్తారు : ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్, డిసెంబర్ 27 (వార్త వేదిక సూర్య):** సీఎం రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు ఆడుతాడని, అందులో భాగంగానే ఎన్నికల సమయంలో హామీలు



ఇచ్చాడని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. బీసీల రిజర్వేషన్ పెంపుపై స్పష్టత ఇవ్వకుండా స్థానిక సంస్థల ఎన్నికలు జరపడానికి వీల్లేదని కవిత అన్నారు. ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. స్థానిక

మిగతా 2లో..



## పంజాబ్‌లో ఘోర ప్రమాదం

- బ్రిడ్జిపై నుంచి పడ్డ బస్సు: 8మంది మృతి

**చండీగఢ్,డిసెంబర్27(వార్త వేదిక సూర్య):** పంజాబ్‌లో ఓ బస్సు బ్రిడ్జిపై నుండి పడిపోయింది. ఈ ప్రమాదంలో 8 మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. పంజాబ్‌లోని భటిండాలో శుక్రవారం ఈ ఘటన జరిగింది.బస్సు తల్వాండి సాబో నుండి భటిండాకు బయలుదేరింది. భారీ వర్షం కారణంగా ప్రమాదవశాత్తు బస్సు బ్రిడ్జిపై నుండి కాల్వలోకి పడిపోయింది. ఆ సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అప్రమత్తమై సంఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తుకు ఆదేశించినట్లు సీనియర్ పోలీసులు తెలిపారు.

మిగతా 2లో..

## వడ్డీలు కట్టలేక సర్పంచ్‌ల ఆత్మహత్యలు!

- పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు
- రాష్ట్రవ్యాప్తంగా పాల్గొన్న సర్పంచ్‌లు

**హైదరాబాద్,డిసెంబర్ 27(వార్త వేదిక సూర్య):** పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని రేవంత్ రెడ్డి సర్కార్‌ను డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లంతా మహాత్మా గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాద్ లంగర్‌హౌస్‌లోని బాపు ఘాట్ వద్ద మహాత్మా గాంధీ

మిగతా 2లో..



TS - TET

## తెలంగాణ టెట్ హాల్‌టిక్కెట్లు విడుదల

- జనవరి 2 నుంచి 20 వరకు పరీక్షల నిర్వహణ

**హైదరాబాద్,(వార్త వేదిక సూర్య):** తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్‌కు హాల్‌టికెట్లు విడుదల య్యాయి. జనవరి 2 నుంచి 20 వరకు జరిగే ఈ పరీక్షల హాల్‌టికెట్లను విద్యాశాఖ అధికారులు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటలవరకు సెషన్-1; మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు

మిగతా 2లో..

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

## తెలంగాణ టెట్ హాల్‌టిక్కెట్లు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

రెండో సెషన్ పరీక్షలు నిర్వహిస్తారు. జనవరి 2, 5, 11, 12, 19, 20 తేదీల్లో ఆరు రోజులు పేపర్ -2 పరీక్షలు జరగనుండగా.. జనవరి 8, 9, 10, 18 తేదీల్లో నాలుగు రోజులు పేపర్ -1 పరీక్షలు నిర్వహిస్తారు. నవంబర్ 7 నుంచి 20 వరకు టెట్‌కు దరఖాస్తులు స్వీకరిం చగా.. దాదాపు 2.75లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ కు సంబంధించిన హాల్ టికెట్లను టీజీ టెట్ కన్వీనర్ శుక్రవారం సాయంత్రం విడుదల చేశారు. టెట్ రాతపరీక్షలను కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించనున్నారు. ఉదయం సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 7.30 నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. మధ్యాహ్నం సెషన్‌కు హాజరయ్యే వారిని మ. 12.30 గంటల నుంచి అనుమతించ నున్నారు. ఇక పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రం గేట్లను క్లోజ్ చేయనున్నారు. అంటే ఉదయం సెషన్‌లో ఉ. 8.45కు, మధ్యాహ్నం సెషన్‌లో 1.45 గంటలకు గేట్లను మూసివేయనున్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌తో పాటు బ్లాక్ లేదా బ్లూ బాల్ పాయింట్ పెన్, గుర్తింపు కార్డుల్లో ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్ పోర్ట్, పాన్ కార్డు, ఓటర్ ఐడీని తీసుకెళ్లాలి. స్మార్ట్ వాచీలతో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు.

## వడ్డీలు కట్టలేక సర్పంచ్‌ల ఆత్మహత్యలు!

(మొదటి పేజీ తరువాయి)

విగ్రహానికి తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం పాటుపడ్డ సర్పంచ్‌ల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించడం లేదన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా ఏడాది కాలంగా ఇబ్బందులకు గురి చేస్తుందని మండి పడ్డారు. పెండింగ్ బిల్లులను చెల్లించకపోవడంతో.. ఆర్థిక ఇబ్బందులు కొంతమంది సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కొందరి సర్పంచ్‌ల కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల కోసం తీసుకొచ్చిన డబ్బులకు వడ్డీలు కట్టలేక వేధింపులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇక మాజీ సర్పంచ్‌లను మభ్యపెట్టకుండా.. వీలైనంత త్వరగా పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, ఉపాధ్యక్షుడు కేశబోయిన మల్లయ్య, గణేష్, నవీన్ కుమార్, పల్లె వెంకటేశం, సంఘం రాష్ట్ర నాయకులు ప్రణీత్ చంద్, బాషబోయిన ఉప్పలయ్య, లాగ్గని రమేశ్, పూర్ణ చందర్ గౌడ్ రాష్ట్ర కమిటి తదితరులు పాల్గొన్నారు.

## నోరు తెరిస్తే సీఎం రేవంత్‌వి పచ్చి అబద్ధాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ పేర్కొన్నదని చెప్పారు. బీసీ సంఘాలతో హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. బీసీల జనాభా ఎంతో తెలికుండా హామీ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. జనాభాలో సగానికిపైగా బీసీలు ఉన్నారని చెప్పారు. కానీ 42 శాతం అని కాంగ్రెస్ ఎలా చెబుతుందో అంతుపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండానే ఎన్నికలు నిర్వహిస్తారా.. అనే అనుమానాలు కలుగుతున్నాయని చెప్పారు. రిజర్వేషన్లు పెంచకుంటే ఎన్నికలు జరగనిచ్చేది లేదని స్పష్టం చేశారు. మండల కేంద్రాలు, జిల్లాల్లో నిరసన ప్రదర్శన చేస్తామన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చిన తర్వాత, బీసీ జనాభాను వెల్లడించిన తర్వాతే ఎన్నికలపై ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు స్థానిక సంస్థల ఎన్నికల గురించి ప్రభుత్వం ఆలోచన చేయకూడదని చెప్పారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా జనవరి 3న ఇందిరా పార్కు వద్ద భారీ సభను నిర్వహిస్తామన్నారు. జనాభా లెక్కల్లో కులగణన చేపట్టాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు ఏటా రూ.20 వేల కోట్లు బడ్జెట్ కేటాయిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పిందని విమర్శించారు.

## న్యూ ఇయర్ గిఫ్ట్‌ల పేరుతో మోసం

(మొదటి పేజీ తరువాయి)

దీనిపై ముందుగానే అలర్ట్ అయిన సైబర్ క్రైం అధికారులు ప్రజలకు తగు సూచనలు జారీ చేస్తున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రజలకు సీనియర్ ఐపీఎస్, టీజీ ఆర్టీసీ ఎండీ వీ.సీ.సజ్జనార్ ఎక్స్ వేదికగా హెచ్చరించారు. నూతన సంవత్సర శుభాకాంక్షల పేరుతో ఉన్నదంతా దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు ఎలాన్ వేశారని, అలర్ట్‌గా ఉండాలని తెలిపారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వారి చేతికి చిక్కి ఖాతాలు ఖాళీ చేసుకోవడమే కాదు, ఫోన్లలో ఉన్న వ్యక్తి గత సమాచారం అంతా పోగొట్టుకోవాల్సి వస్తుందన్నారు. న్యూ ఇయర్ విషెస్ చిత్రాలు, సందేశాలను మీ పేరుతో సహా తయారు చేసుకొని ఇతరులకు పంపవచ్చని, ఇందుకోసం ఈ కింది లింకుపై క్లిక్ చేసి వివరాలు నమోదు చేస్తే చాలని స్మార్ట్ ఫోన్లకు సందేశాలు పంపిస్తున్నారు. పొరపాటున వాటిపై క్లిక్ చేశారంటే తిప్పలు తప్పవన్నారు. ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్(ఏపీకే) ÷ల్స్ రూపంలో పంపే ఈ గూఢచర్య అప్లికేషన్ ఒకసారి ఫోన్లోకి జొరబడిందంటే అందులోని సమస్త సమాచారం నేరగాళ్ల అధీనం లోకి వెళ్లిపోతుందన్నారు. బ్యాంకు ఖాతాల వివరాలు, ఫొటోలు, వీడియోలు, కాంటాక్ట్ నంబర్లు, ఇతర ÷ల్స్ అన్నీ తీసేసుకుంటారు. కాబట్టి నూతన సంవత్సర సందేశాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఇప్పటికే పెద్ద ఎత్తున సందేశాలు పంపుతున్న సైబర్ కేటుగాళ్లు రాబోయే రెండు, మూడు రోజుల్లో తమ దాడుల్ని తీవ్రతరం చేసే అవకాశం ఉంది.. జాగ్రత్త!! అంటూ సజ్జనార్ ట్వీట్ చేశారు.

## సిఫారసు లేఖలు పరిగణలోకి..

(మొదటి పేజీ తరువాయి)

దర్శనానికి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు తీసుకోవడం లేదనే ప్రశ్నపై టీటీడీ ఈవో శ్యామల రావు గతంలో స్పందించారు. శ్రీవారి దర్శనానికి ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన సిఫారసు లేఖలు మాత్రమే అనుమతిస్తున్నామని స్పష్టత ఇచ్చారు. తెలంగాణ నుంచి సిఫార్సు లేఖలు తీసుకువస్తే.. చెల్లుబాటు కావని స్పష్టమైంది. దీంతో తెలంగాణ ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవస్థానంలో తెలంగాణ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులను చిన్న చూపు చూస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి పలు ఘటనలు వరుసగా వెలుగులోకి వచ్చాయి.దీంతో తాజాగా టీటీడీ బోర్డు తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖల అంశాన్ని పునఃపరిశీలించింది. మిత్ర, సాటి తెలుగు రాష్ట్రంపై ఇలాంటి నిర్ణయం సరికాదనుకుంది. బోర్డులోని మెజారిటీ సభ్యులు కూడా సిఫారసు లేఖలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. దీంతో బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. ఇక తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలు వారానికి రెండు సార్లు అనుమతిస్తారు.

## మన్మోహన్ కేబినేట్‌లో పని చేయడం అదృష్టం

(మొదటి పేజీ తరువాయి)

సంస్కరణల ఆర్కిటెక్టుగా మన్మోహన్ సింగ్ దేశానికి అమోఘమైన సేవలందించారన్నారు. ఆయనతో తెలంగాణకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి రాష్ట్ర ఏర్పాటు వరకు మన్మోహన్ అందించిన సహకారం తెలంగాణ సమాజం ఎప్పటికీ మర్చిపోదు. తెలంగాణ కోసం పోరాడిన సమయంలో ప్రతి సందర్భంలో మనోధైర్యాన్ని నింపుతూ అండగా నిలిచారు.

మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు జరిగింది. రాష్ట్ర ఏర్పాటులో సానుకూల వైఖరితో ఆయన అందించిన సహకారం మరువలేనిది. తెలంగాణ సమాజానికి అత్యంత ఆప్తుడైన మన్మోహన్‌కు భారాస తరఫున ఘన నివాళులు' అని కేసీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు బీఆర్ఎస్ ముఖ్య నేతలు ఢిల్లీకి బయల్దేరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాజ్యసభ ఎంపీలు, పలువురు నాయకులు శుక్రవారం సాయంత్రం ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. ఆర్థిక సంస్కరణల పితామహుడు మన్మోహన్ సింగ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలోని పార్టీ ఎంపీలు, నాయకుల బృందం ఘన నివాళులర్పించనుంది. అంత్యక్రియల్లో పాల్గొని మన్మోహన్ సింగ్‌కు బీఆర్ఎస్ నేతలు ఘనంగా వీడ్కోలు పలకనున్నారు. దేశ ఆర్థిక సంస్కరణల ఆర్కిటెక్ట్‌గా మన్మోహన్ సింగ్ దేశానికి అమోఘమైన సేవలందించారని కేసీఆర్ పేర్కొన్నారు. దాంతో పాటు తెలంగాణకు ప్రత్యేకమైన అనుబంధం మన్మోహన్ సింగ్‌తో ఉంది. వారి కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన నాకు వారితో వ్యక్తిగత అనుబంధముంది. వారెంతో స్థితప్రజ్ఞత కలిగిన దార్శనికులు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి రాష్ట్ర ఏర్పాటు దాకా వారందించిన సహకారం తెలంగాణ సమాజం మరువదు. తెలంగాణ కోసం పోరాడుతున్న నాకు, టీఆర్ఎస్ పార్టీకి ప్రతి సందర్భంలో మనోధైర్యాన్ని నింపుతూ వారు అండగా నిలిచారు. వారు ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ఏర్పాటులో సానుకూల వైఖరితో నాకు వారందించిన సహకారం మరువలేను. ఈ నేపథ్యంలో తెలంగాణ సమాజానికి అత్యంత ఆప్తుడైన మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళులు అర్పించాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. వారి కడసారి వీడ్కోలు సందర్భంగా అంత్యక్రియల్లో పాల్గొనాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను, ఎంపీలను ఆదేశించాను. ఈ మేరకు వారు హాజరు కానున్నారని కేసీఆర్ తెలిపారు.




## నిజమైన రాజనీతిజ్ఞుడు మన్మోహన్

**దేశం కోసమే తన జీవితాన్ని దారపోశారు**

**మన్మోహన్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తాం**

**సీడబ్ల్యూసీ ప్రత్యేక సమావేశంలో తీర్మానం**

**న్యూఢిల్లీ,డిసెంబర్27(వార్త వేదిక సూర్య):** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సంతాప తీర్మానం చేసింది. మన్మోహన్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తామని సీడబ్ల్యూసీ తీర్మానం చేసింది. ఆయన నిజమైన రాజనీతిజ్ఞుడని, దేశం కోసమే తన జీవితాన్ని దారపోశారని గుర్తు చేసుకున్నారు.

ఏఐసీసీ కార్యాలయంలో సీడబ్ల్యూసీ సభ్యులు సమావేశమై సంతాప తీర్మానం చేశారు. శనివారం జరిగే మన్మోహన్ సింగ్ అంతిమసంస్కారాల నిర్వహణపై కూడా చర్చించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, సోనియా, రాహుల్ గాంధీ, ప్రియాంక, తదితర నేతలంతా పాల్గొన్నారు.

భారతదేశ రాజకీయ, ఆర్థిక రంగంలో మన్మోహన్ ఒక మహోన్నత వ్యక్తి అని, ఆయన చేసిన కృషి దేశాన్ని మార్చివేసిందని తెలిపింది. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఆయనకు గౌరవాన్ని తెచ్చిపెట్టిందని గుర్తుచేసుకున్నారు. 1990 ప్రారంభంలో ఆర్థిక మంత్రిగా భారతదేశ ఆర్థిక సరళీకరణకు రూపశిల్పి అని కొనియాడారు. అసమానమైన దూరదృష్టితో వరుస సంస్కరణలను ప్రారంభించారన్నారు. దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి రక్షించడమే కాకుండా ప్రపంచ మార్కెట్లకు కూడా తలుపులు తెరిచాయని స్మరణచేసుకున్నారు. నియంత్రణ సడలింపు, ప్రైవేటీకరణ మరియు విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహం వంటి విధానాల ద్వారా భారతదేశం వేగవంతమైన ఆర్థిక వృద్ధికి పునాది వేశారని నేతలు నెమరువేసుకున్నారు.

ఆయన నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉద్భవించిందని కొనియాడారు. ఇది ఆయన ప్రతిభ, దార్శనికతకు నిదర్శనం అని సీడబ్ల్యూసీ పేర్కొంది. నిజమైన రాజనీతిజ్ఞుడు మన్మోహన్ సింగ్ అని పేర్కొంది.

## మాజీ ప్రధాని, ఆర్థిక వేత్త మన్మోహన్‌కు సీఎం రేవంత్ నివాళి

(మొదటి పేజీ తరువాయి)

1991లో పీవీ నరసింహారావు ప్రధాని మంత్రిగా ఉన్నప్పుడు మొట్టమొదటిసారిగా మన్మోహన్ సింగ్‌ను ఆర్థిక శాఖ మంత్రి నియమించారని గుర్తు చేశారు. 15 టన్నుల బంగారాన్ని కుదవపెట్టి ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చారన్నారు. భారతదేశ ఆర్థిక





పరిస్థితి కుదేలైన సమయంలో ప్రధానిగా పీవీ నరసింహారావు, ఆర్థిక శాఖ మంత్రిగా మన్మోహన్ సింగ్ వచ్చారని వెల్లడించారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి గల ముఖ్య కారకుడు మన్మోహన్ సింగ్ అని మల్లు రవి కొనియాడారు. ఆ ఐదు సంవత్సరాలు ఆర్థిక ఇబ్బందులను బయటపడి ప్రగతి పథంలో ముందుకు వెళ్ళిందన్నారు. మన్మోహన్ సింగ్ అంటేనే సంస్కరణలకు పెట్టింది పేరని.. దేశం ఒక మహా నేతను కోల్పోయిందన్నారు. మన్మోహన్ సింగ్ తీసుకువచ్చిన సంస్కరణల అడుగుజాడల్లోనే తదుపరి వచ్చిన ప్రధాన మంత్రులు నడుచుకున్నారని స్పష్టం చేశారు. ఆయనను గొప్ప ప్రధానిగా గుర్తించి సేవలను అందరూ తలచుకుంటున్నారన్నారు.

## ఆయన మరణం దేశానికి తీరని లోటు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధానమంత్రిగా అపారమైన జ్ఞానం, సమగ్రతతో భారతదేశాన్ని అభివృద్ధి వైపు నడిపించారు. ఆయనలోని వినయం, ఆర్థికశాస్త్రంపై ఆయనకున్న లోతైన అవగాహన దేశానికి స్ఫూర్తినిచ్చాయి. నా జీవితంలో ఎంతో ముఖ్యమైన ఓ గురువును కోల్పోయాను' అని అన్నారు. ప్రియాంకా గాంధీ వాద్రా, ఆమె భర్త రాబర్ట్ వాద్రా సైతం మన్మోహన్ నివాసానికి చేరుకున్నారు. రాబర్ట్ వాద్రా మాట్లాడుతూ.. మన్మోహన్ ఎల్లప్పుడూ ప్రజల గురించే ఆలోచిస్తూ దేశ అభివృద్ధికి కృషి చేసేవారని పేర్కొన్నారు. ఆర్థిక విషయాలపై ఆయనకు చాలా జ్ఞానం ఉందని అన్నారు. మన్మోహన్ సింగ్ యూపీఏ హయాంలో 2004 నుంచి 2014 వరకు భారత ప్రధానిగా పని చేశారు. కాంగ్రెస్ పార్టీతో, గాంధీ కుటుంబంతో మన్మోహన్‌కు మంచి సంబంధాలు ఉన్నాయి. గురువారం రాత్రి ఆయన మరణవార్త తెలియడంతో కర్ణాటకలోని బెళగావిలో జరుగుతున్న సీడబ్ల్యూసీ సమావేశాలను అర్ధంతరంగా ముగించి.. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ వెంటనే దిల్లీకి బయలుదేరారు. దిల్లీలోనే ఉన్న సోనియా, ప్రియాంక ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు.శనివారం ఆయన అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. దీనిపై అధికారిక ప్రకటన చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మన్మోహన్ పార్థివ దేహాన్ని ఆయన నివాసంలో ఉంచారు. ప్రజల సందర్శనార్థం శనివారం ఆయన భౌతికకాయాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తీసుకురానున్నారు. రాజ్‌ఘాట్ సమీపంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

## అవినీతి వ్యతిరేక చర్యలపై వేగంగా స్పందించారు

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకున్న నేత అని కొనియాడారు. మహారాష్ట్రలో తన స్వగ్రామమైన రాలేగావ్ సిద్ధిలో జాతీయ వార్తా సంస్థతో హజారే మాట్లాడుతూ, పుట్టినవారికి మరణం తప్పదని, అయితే కొన్ని జ్ఞాపకాలు, వారసత్వం మాత్రం మిగిలి పోతాయని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు డాక్టర్ మన్మోహన్ సింగ్ కొత్త దిశను చూపించారని, దేశం, సమాజ సంక్షేమానికి సింగ్ ప్రాధాన్యతనిచ్చేవారని అన్నారు. లోక్‌పాక్ నిరసనలను చేపట్టిన సమయంలో తనను మన్మోహన్ చర్చలకు ఆహ్వానించారని, త్వరితగతిన నిర్ణయాలు తీసుకునేవారని అన్నా హజారే గుర్తు చేసుకున్నారు. 'ఆయన అవినీతికి వ్యతిరేకం. లోక్‌పాల్, లోకాయుక్త చట్టాలకు సంబంధించి వెంటనే నిర్ణయాలు తీసుకున్నారు. ఆయన ఎప్పుడు దేశం గురించి, ప్రజలకు ఎంత మెరుగైన సేవలందించాలనే విషయం గురించే ఆయన నిరంతరం ఆలోచించే వారు' అని హజారే పేర్కొన్నారు. భౌతికంగా మన్మోహన్ ఈలోకాన్ని విడిచిపెట్టినప్పుడు, ప్రజల మనసుల్లో ఎప్పటికీ జ్ఞాపకం ఉంటారని అన్నారు.

## కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై విచారణ వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ వాయిదా పడింది. కేటీఆర్‌ను ఈనెల 31 వరకు అరెస్ట్ చేయవద్దంటూ హైకోర్టు ఆదేశించింది. విచారణను డిసెంబర్ 31కి వాయిదా వేసింది. కాగా.. ఫార్ములా ఈరేస్ కేసుకు సంబంధించి ఇప్పటికే హైకోర్టు డిసెంబర్ 30 వరకు కేటీఆర్‌కు నాట్ టు అరెస్ట్ ఇచ్చిన విషయం తెలిసిందే. కేటీఆర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని, అరెస్ట్ చేయవద్దని గత విచారణలో హైకోర్టు ఆదేశించింది. శుక్రవారం ఫార్ములా ఈరేస్ కేసు హైకోర్టులో విచారణకు రాగా.. ఏసీబీ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. అలాగే ఏసీబీ మరో పిటిషన్ కూడా దాఖలు చేసింది. కేటీఆర్ నాట్ టు అరెస్ట్ ఆదేశాలను ఎత్తివేయాలని పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌కు సంబంధించి కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా కేటీఆర్, రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 31 వరకు వాయిదా వేసింది. ఇప్పటి వరకు 30 వరకు ఉన్న నాట్ టు అరెస్ట్‌ను.. మరొక్క రోజుకు హైకోర్టు ధర్మాసనం పొడిగించింది. ఈనెల 31న నాట్ టు అరెస్ట్ పిటిషన్‌పైన అలాగే ఫార్ములా ఈ రేసింగ్‌కు సంబంధించి నమోదైన కౌంటర్‌పై కూడా హైకోర్టు పూర్తి స్థాయిలో విచారణ జరపనుంది. ఇప్పటి వరకు ఫార్ములా ఈరేస్ వ్యవహారానికి సంబంధించి సుదీర్ఘంగా వాదనలు వినిపించిన తర్వాత కేటీఆర్‌కు హైకోర్టు స్వల్ప ఊరటనిచ్చింది. అయితే దాన్ని కూడా ఎత్తివేయాలని, పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఏసీబీ పిటిషన్‌లో పేర్కొంది. ఈ సమయంలో కేటీఆర్‌కు బెయిల్ మంజూరు చేసినా, రిలీఫ్ ఇచ్చినా, నాట్ టు అరెస్ట్ ఇచ్చినా విచారణకు ఇబ్బందికర వాతావరణం ఉంటుందని ఏసీబీ వెల్లడించింది. నాట్ టు అరెస్ట్‌ను ఎత్తివేయాలని ఏసీబీ మరో పిటిషన్‌ను వేసింది. ఆ పిటిషన్‌కు సంబంధించి ప్రతివాదిగా కేటీఆర్‌ను చేర్చారు. దీంతో కేటీఆర్ కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. డిసెంబర్ 31న ఫార్ములా ఈ కార్ రేస్‌పై ప్రభుత్వం వేసిన పిటిషన్‌పైన వాదనలు కొనసాగుతాయి. అలాగే నాట్ టు అరెస్ట్‌పై కేటీఆర్ కౌంటర్ దాఖలు చేసిన తర్వాత వాదనలు జరుగనున్నాయి. ఈ రెండు అంశాలపై డిసెంబర్ 31న ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత తెలంగాణ హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకోబోతుంది అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

## విచారణ వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

కౌంటర్ దాఖలు చేయడానికి పోలీసులు సమయం కోరారు. సంధ్య థియేటర్ ఘటనలో నాంపల్లి కోర్టులో జరిగిన విచారణకు వర్చువల్‌గా అల్లు అర్జున్ హాజరయ్యారు. విచారణను జనవరి 10కి నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. గతంలో అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. రిమాండ్ గడువు ముగియడంతో కోర్టు ముందుకు అల్లు అర్జున్ హాజరయ్యారు. డిసెంబర్ 4న ఆర్ టిసి క్రాస్ రోడ్డులో సంధ్య థియేటర్‌లో పుష్ప 2 సినిమా విడుదల కావడంతో పాటు హీరో అల్లు అర్జున్ అక్కడికి రావడంతో తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. మొత్తంగా టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్ విచారణ సోమవారానికి వాయిదా పడింది. ప్రస్తుతం మధ్యంతర బెయిల్ మీద బయట ఉన్న అల్లు అర్జున్ రెగ్యూలర్ బెయిల్ పిటిషన్ కోసం నాంపల్లి కోర్టులో పిటిషన్ వేశారు. మరోవైపు రెండు వారాల జ్యుడీషియల్ రిమాండ్ గడువు సైతం పూర్తి కావడంతో హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చిన విషయాన్ని నాంపల్లి కోర్టుకు తెలిపారు. రెగ్యూలర్ బెయిల్ పిటిషన్ కోసం అల్లు అర్జున్ తరఫున ఆయన లాయర్లు కోర్టులో పిటిషన్ వేశారు. నాంపల్లి కోర్టు ఈ పిటిషన్ విచారణ స్వీకరించింది. కోర్టులో విచారణ ప్రారంభం కాగా, కౌంటర్ ధాఖలు చేసేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమయం కోరారు. దాంతో నాంపల్లి కోర్టు తదుపరి విచారణ వచ్చే సోమవారానికి వాయిదా వేసింది. అల్లు అర్జున్ నేరుగా కాకుండా వర్చువల్ గా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యారు. మొదట అల్లు అర్జున్ విచారణకు వస్తారని నాంపల్లి కోర్టు వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే వర్చువల్‌గా హాజరు అవుతారని ఆయన తరఫున లాయర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లగా, అల్లు అర్జున్ అభ్యర్థనను కోర్టు మన్నించింది. నాంపల్లి కోర్టు విధించిన జ్యుడీషియల్ రిమాండ్ గడువు నేటితో ముగియనుందని విచారణ జరిపారు. పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా డిసెంబర్ 4వ తేదీన సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ చనిపోగా, ఆమె కుమారుడు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. థియేటర్ వద్ద తొక్కిసలాట కేసు విచారణనూ సైతం నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. జనవరి 10వ తేదీన తదుపరి విచారణను చేపట్టనున్నట్లు కోర్టు వెల్లడించింది. అల్లు అర్జున్ రిమాండ్ పై సైతం అదేరోజు విచారణ జరగనుంది.

## నిమ్స్‌లో ఓపీ సేవలు బంద్

(మొదటి పేజీ తరువాయి)

చేస్తాయని పేర్కొన్నారు. ఓపీ సాధారణ సేవలు డిసెంబర్ 28 నుంచి అందుబాటులోకి వస్తాయని డాక్టర్ బీరప్ప స్పష్టం చేశారు. ఓపీ సేవలను ఆకస్మికంగా నిలిపివేయడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన తాము ఎక్కడ చూయించుకోవాలని ఆందోళన వ్యక్తం చేశారు. ఓపీ సేవలు బంద్ చేస్తున్నట్లు ఎలాంటి ప్రకటన చేయకపోవడం, ఇక్కడికి వచ్చాక సేవలు నిలిపివేసినట్లు తెలియడంతో రోగులు, వారి అటెండర్లు నిమ్స్ డాక్టర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మన్మోహన్‌కు ప్రముఖుల నివాళి

(మొదటి పేజీ తరువాయి)

అంత్యక్రియలను పూర్తి అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ఇప్పటికే కేంద్రం ప్రకటించింది. మోడీ అధ్యక్షతన కేంద్ర కేబినేట్ అత్యవసరంగా సమావేశమై ఘనంగా నివాళి అర్పించింది. వారంపాటు సంతాపదినాలు ప్రకటించింది. మన్మోహన్ మృతికి సంతాప సూచకంగా కేంద్ర ప్రభుత్వం 7 రోజులు సంతాప దినాలను ప్రకటించింది. రాష్ట్రపతి భవన్ సహా అన్ని ప్రభుత్వ భవనాలపై జాతీయ పతాకాన్ని సగానికి అవనతం చేశారు. అటు ఏఐసీసీ ప్రధాన కార్యాలయంపైనా జాతీయజెండాను సగానికి దించారు. కాంగ్రెస్ పార్టీ కూడా వచ్చే ఏడు రోజుల పాటు కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకుంది.
92 ఏళ్ల మన్మోహన్ సింగ్ వయసురీత్యా తలెత్తిన అనారోగ్య సమస్యలతో గత రాత్రి ఇంటివద్ద అకస్మాత్తుగా స్పృహ కోల్పోయారు. దీంతో కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మన్మోహన్ పదేళ్ల పాటు దేశానికి ప్రధానిగా సేవలందించారు. అంతకుముందు ఆర్‌బీఐ గవర్నర్‌గా వ్యవహరించారు. ప్రధానిగా పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలను పూర్తి అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ఇప్పటికే కేంద్రం వెల్లడించింది. ఆయన మృతికి సంతాప సూచికంగా 7 రోజులు సంతాప దినాలను ప్రకటించింది. ప్రజల సందర్శనార్థం శనివారం ఆయన భౌతికకాయాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తీసుకురానున్నారు. శనివారం రాజ్‌ఘాట్ సమీపంలో ఆయన అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

## అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు కుటుంబాలకు ఎస్పీ పరామర్శ

**ములుగు,డిసెంబర్ 27(వార్త వేదిక సూర్య):** అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు నేతలు బడే చొక్కారావు, కొయ్యాడ సాంబయ్య ఇళ్లను జిల్లా ఎస్పీ శబరీష్ శుక్రవారం సందర్శించారు. తాడ్వాయి మండలం కాల్వపల్లిలో బడే చొక్కారావు ఇంటికి వెళ్లి.. తల్లి బతుకమ్మకు నిత్యావసరాలు అందించారు. గోవిందరావుపేట మండలం మొద్దులగూడెంలో సాంబయ్య ఇంటికి కూడా వెళ్లారు ఎస్పీ. సాంబయ్య భార్య సుజాతకు నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ.. బడే చొక్కారావు, కొయ్యాడ సాంబయ్య అడవి వీడి జనంలోకి రావాలని ఎస్పీ శబరీష్ పేర్కొన్నారు. చొక్కారావు, సాంబయ్యపై ఉన్న రివార్డులతో పాటు ఇండ్ల మంజూరుకు ములుగు ఎస్పీ హామీ ఇచ్చారు.

# మాజీ ప్రధాని డా.మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళులు

**- చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి**

ఎల్బీనగర్,డిసెంబర్ 27,(వార్త వేదిక సూర్య): ఎల్బీనగర్ చౌరస్తాలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్ద గౌని రామ్మోహన్ గౌడ్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ భారతదేశానికి 2.సార్లు ప్రధానమంత్రిగా, ఆర్థిక శాఖ మంత్రిగా పదవులను కొనసాగించి భారతదేశ ప్రజలకు ఆర్థికంగా గ్లోబల్ స్థాయికి చేర్చిన మహానుభావుడు కాంగ్రెస్ పార్టీకి దిశా నిర్దేశకుడినిఅనేక సేవలను అభివృద్ధి కార్యక్రమాలను చేయడం జరిగిందని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో కీలకపాత్ర పోషించారని వారన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షులు మిద్దెల జితేందర్



GHMC ఫ్లోర్ లీడర్, లింగోజి గూడ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి , సంకేపల్లి సుధీర్ రెడ్డి జక్కిడి ప్రభాకర్ రెడ్డి , వజీర్ ప్రకాష్ , మల్లారపు షాలిని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు డా.



మన్మోహన్ సింగ్ ను స్మరించుకుంటూ ఆయన మరణంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు సంతాపం తెలిపారు.

# మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించిన బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్

గండిపేట్, (వార్త వేదిక సూర్య): మన్మోహన్ సింగ్ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి చెందడంతో నార్సింగి మున్సిపాలిటీ మంచిర్యాల చౌరస్తాలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. దేశ ప్రధానిగా మన్మోహన్ సింగ్ చెరగని ముద్రవేశారని గుర్తు చేశారు. యూపీఏ ప్రభుత్వానికి నాయకత్వం వహించి ప్రధానమంత్రిగా అనేక కార్యక్రమాలను చేపట్టారని గుర్తు చేశారు. అలాంటి మహనీయుడు భౌతికంగా మన మధ్య లేకపోవడం కలచి వేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి, నార్సింగ్ మున్సిపాలిటీ చైర్మన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, నార్సింగ్ మార్కెట్ కమిటీ చైర్మన్ కోట వేణు గౌడ్, కౌన్సిలర్లు ఉషారాణి, దుర్గేష్ యాదవ్, వినోద్, కుమ్మరి శేఖర్, రాము, ప్రభు,



మన్నే రవీందర్, అరుణ్ కుమార్, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ప్రధాని మన్మోహన్‌కు నివాళులర్పించిన కాంగ్రెస్ శ్రేణులు



గండిపేట్, (వార్త వేదిక సూర్య): కాంగ్రెస్ హయాంలో ప్రధానిగా మన్మోహన్ సింగ్ తనకంటూ చెరగని ముద్రను వేశారని రంగారెడ్డి జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షుడు ఎం ధనుంజయ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీజేఆర్ అరాంఘర్ చౌరస్తాలో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రధానిగా మన్మోహన్ చేపట్టిన కార్యక్రమాలను గుర్తు చేసుకొని ఆయన సేవలను కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అద్యక్షుడు మహమ్మద్ కాలిక్, సులేమాన్ నగర్ డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్ ఇస్మాయిల్, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, బొల్లా వెంకటేష్, రవీందర్ రెడ్డి, భాస్కర్ గౌడ్, ఉపేందర్, శ్రీనివాస్, గోపి, రాము, గోల్కొండ యాదయ్య, నరసింహ యాదవ్,బస శ్రీనివాస్ నేత, ఓం ప్రకాష్,మామిడి శెట్టి శ్రీనివాస్ నేత, విగ్నేష్, గోపికృష్ణ, సహదేవ్, నయీమ్, రాంబాబు, గట్టయ్య, మధుబాబు, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.



## తడి పొడి చెత్తను వేరు చేసి అందివ్వాలి

**- కార్పొరేషన్ కమిషనర్ శరత్చంద్ర**

గండిపేట్, (వార్త వేదిక సూర్య) : ప్రజలు చెత్తను వేరు చేసి అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్చంద్ర అన్నారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్ భవాని నగర్ కాలనీ, 17వ డివిజన్ భాగ్యనగర్ కాలనీ, 18వ డివిజన్ వెంకటేశ్వర కాలనీలలో చెత్త సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన చెత్తను వేరు చేసి అందివ్వాలని ప్రజలకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తడి పొడి హానికరమైన చెత్తను వేరుచేసి ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలే సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్లు వెంకటేష్, జగన్, సురేష్, యాదగిరి, రాము తదితరులు పాల్గొన్నారు






## బీజేఎంసీ 18వ వార్డులో సమస్యల పరిష్కారమే ధ్యేయం

**- కార్పొరేటర్ ప్రతినిధి గోకరి సురేష్ గౌడ్**

గండిపేట్, (వార్త వేదిక సూర్య): బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని 18 వ వార్డులో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ ప్రతినిధి గోకరి సురేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం వార్డు పరిధిలోని ధాత్రి కాలనీలో సెకండ్ లేయర్ సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డులో ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలను చూపుతున్నట్లు వివరించారు. ఎప్పటి కప్పుడు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఫస్ట్ లేయర్లో 8 ఇంచుల రోడ్డు వేసినట్లు తెలిపారు. సెకండ్లు మరో నాలుగు ఇంచుల రోడ్డును వేయడం జరిగిందని తెలిపారు. మొత్తం ఒక ఫీట్ రోడ్డు వేసినట్లు వివరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేస్తున్నామని వెల్లడించారు.

## మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించిన బీజేఎంసీ కాంగ్రెస్ నాయకుడు

గండిపేట్, (వార్త వేదిక సూర్య): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి అన్నారు.





ఆయన మృతి అందర్నీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని వ్యాఖ్యానించారు. ఈ మేరకు శుక్రవారం మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. దేశం గొప్ప నాయకుడిని కోల్పోయిందని అన్నారు. ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడే దేశంలో అనేక ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టి దేశాన్ని అభివృద్ధిలో ముందుకు నడిపిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మహేందర్ గౌడ్, నార్సింగ్ మార్కెట్ కమిటీ సభ్యులు తలారి ప్రేమ్ కుమార్, సురేష్ గౌడ్, అంకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## మన్మోహన్ సింగ్ నివాళులర్పించిన మణికొండ కాంగ్రెస్ నాయకులు

గండిపేట్, (వార్త వేదిక సూర్య): మన్మోహన్ సింగ్ దేశ ప్రధానిగా విశేష సేవలు అందించారని మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు జితేందర్ అన్నారు. మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరనిలోటని వ్యాఖ్యానించారు. ఈ మేరకు శుక్రవారం మణికొండలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్య క్రమంలో నాయకులు కిరణ్, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, పురుషోత్తం, యాలాల




నరేష్, అహ్మద్ షా, బుద్దోలు శ్రీరాములు, ముత్యాలు, మల్లేష్, ప్రధాన కార్యదర్శి అఖిల్, మైనారిటీ నాయకులు హాజీ, పృథ్వీ రాజు, మహిళా నాయకురాలు ఇందిరా, ప్రభావతి, సావిత్రి శ్రీనివాస్ చారి, జగన్లు పాల్గొన్నారు.




# రూ.15 లక్షల మద్యం పట్టివేత

- డ్యూటీ ఫ్రీ మద్యం ముసుగులో లిక్కర్ వ్యాపారం
- పట్టుబడ్డ కానిస్టేబుల్, హెూంగార్డు.
- మూడు కార్లు స్వాధీనం
- ఐదుగురిపై కేసులు నమోదు

గండిపేట్(వార్త వేదిక సూర్య): శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పని చేస్తున్న కానిస్టేబుల్, హెూంగార్డులు కలిసి డ్యూటీ ఫ్రీ లిక్కర్‌ను ఎక్సైజ్ బృందం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నూతన సంవత్సరం వేడుకల కోసం భారీగా కొనుగోళ్లు చేసి రూ.15 లక్షల విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీఐపీలు వచ్చినప్పుడు, ప్రోటోకాల్‌లో భాగంగా విధులు నిర్వహించినటువంటి కానిస్టేబుల్, హెూంగార్డు మరి కొంత మందితో కలిసి ఎయిర్‌పోర్టులో ఉండే డ్యూటీ ఫ్రీ లిక్కర్ దుకాణాల నుంచి మద్యాన్ని పలువురు ప్యాసింజర్ల పేరుతో కొనుగోలు డ్యూటీ ఫ్రీ మద్యం బాటిళ్లను అమ్మకాలు చేపడుతూ లాభాలను ఆర్జిస్తున్నారు. ఈ విషయాన్ని పసిగట్టిన ఎక్సైజ్ డిటిఎఫ్ పోలీసులు డ్యూటీ ఫ్రీ మద్యం అమ్మకాలు జరుపుతుండగా మూడు కార్లను, వాటిలో లభించిన మద్యాన్ని స్వాదీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యం విలువ రూ.15 లక్షలు ఉంటుంది.

ఈ సందర్భంగా ఉప్పర్‌పల్లిలోని శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూపరెంటెం డెంట్ కృష్ణప్రియ మాట్లాడుతూ శంషాబాద్‌లో ఉంటున్న ఎం.గిమ్యా నాయక్(37) శంషాబాద్ ఆర్‌జీఐఏ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మాధాపూర్‌కు చెందిన గిధర హరీష్ కుమార్‌రెడ్డి (24) సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. గౌలిదొడ్డికి చెందిన పోట్లూరి రాఘవేందర్‌రావు(36) ఆర్ట్ బోటిక్ హెూటల్‌లో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుద్వేల్ ప్రాంతానికి చెందిన బండారి లింగయ్య(36) ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో హెూంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. మరో నిందితుడు మహేశ్వర్ పరారీలో ఉన్నాడు. జి.గామ్యానాయక్ ఆర్‌జీఐఏ శంషాబాద్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్‌గా గత 2.5 సంవత్సరాల నుంచి ఆర్‌జీఐఏ విమానాశ్రయంలోని ఆర్‌జీఐఏ పోలీస్ అవుట్ పోస్ట్‌లో పని చేస్తున్నాడన్నారు. బండారి లింగయ్య గత ఐదు సంవత్సరాల నుంచి ఆర్‌జీఐఏ విమానాశ్రయంలోని ఆర్‌జీఐఏ పోలీస్ అవుట్‌పోస్ట్‌లో హెూంగార్డుగా పని చేస్తున్నాడన్నారు. ప్రయాణికులను బోర్డింగ్‌లో దింపేందుకుపై అధికారికి తెలియజేసినట్లు వారు వీఐపీల కోసం



ప్రొటోకాల్ విధులు నిర్వహించేవారన్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ డ్యూటీ ఫ్రీ షాప్‌లోని బిల్లింగ్ కౌంటర్‌లో పని చేస్తున్న మహేందర్‌తో పరిచయం ఏర్పడిందన్నారు. విదేశీ దేశాల నుంచి ఇండియన్ ఇంటర్నేషనల్ ప్రయాణికులు వచ్చినప్పుడు వీరు డ్యూటీ ఫ్రీ బాటిల్స్‌కు సంబంధించిన ప్రయాణికుల పాస్‌పోర్టు, బోర్డింగ్ పాస్‌తో దుకాణంలో బాటిళ్లను కొనుగోలు చేయడానికి వారిని సంప్రదించేవారన్నారు. దీని నుంచి ఒక్కొక్కరు 15-20 బాటిళ్లను సేకరిస్తున్నాన్నారు. వారికి విమానాశ్రయంలో ప్రత్యామ్నాయ విధులు ఉన్నాయన్నారు. హైదరాబాద్ డ్యూటీ ఫ్రీ బాటిళ్లను సేకరించడం, రవాణా చేయడం, విక్రయించడం వంటి విశ్వసనీయ సమాచారం మేరకు డీటిఎఫ్ శంషాబాద్ బృందం డ్యైటీ నుంచి రిలీవ్ అయిన ఎం.గమ్యానాయక్ టిఎస్07హెచ్‌యూ 2111 నెంబర్ గల హ్యూందాయ్ వెన్యూ కారును పట్టుకున్నా రన్నారు. హరీష్‌కుమార్ ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ శంషాబాద్ వద్ద రాయల్ సెల్యూట్ బాటిళ్లను సేకరించడానికి వచ్చినప్పుడు పట్టుకోవడం జరిగింద న్నారు. గమ్యానయక్ కారులో వెతకగా హైదరాబాద్ డ్యూటీ ఫ్రీ మద్యం సీసాలు ఆరు, డిఫెన్స్ మద్యం సీసాలు నాలుగు దొరికా యన్నారు. విచారణలో గెమ్యానాయక్ 16 గోల్డ్ లేబుల్ బాటిళ్లను రాఘవేంద్రరావు తన ఆర్ట్ బోటిక్ హెూటల్ డెలివరి చేసి టిజి09డి123 నెంబర్ గల తన హ్యూదాయ్ ఐ20 కారులో ఉంచినట్లు వెల్లడించాడన్నారు. వెంటనే ఆర్ట్ బోటిక్ హెూటల్‌కు వెళ్లి అక్కడ రాఘవేంద్రరావు తన కారును శోధించగా అందులో ఎనిమిది గోల్డ్ లేబుల్ విస్కీ బాటిళ్లు, ఒక్కొక్కటి ఒక లీటర్ కెపాసిటీ భ్యమైయ్యాయన్నారు. ఇంకొక కేసులో బండారి లింగయ్య మారుతీ డిజైర్ కారు ఏపి09బిడబ్ల్యు4066ను ఆరాంఘర్ చౌరస్తా వద్ద పట్టుకున్నామన్నారు. వాహనాన్ని వెతకగా అందులో 23 డ్యూటీ ఫ్రీ మద్యం సీసాలు, ఒక్కొక్కటి 1 లీటర్ సామర్థ్యం, రెండు డిఫెన్స్ లిక్కర్ బాటిళ్లు, ఒక్కొక్కటి 750 మిలీ దొరికాయన్నారు. హైదరాబాద్ డ్యూటీ ఫ్రీ లిక్కర్ 41 సీసాలు, ఒక్కొక్కటి ఒక లీటర్ సామర్థ్యం 40.4 లీటర్లు, డిఫెన్స్ లిక్కర్ 6 సీసాలు, ఒక్కొక్కటి 750 ఎంఎల్ సామర్థ్యం 4.5 లీటర్లు, మొబైల్ ఫోన్లు నాలుగు, మూడు కార్లు హ్యూందాయ్ వెన్యూ కార్ టిఎస్07 హెచ్‌యూ 2111, హ్యూందాయ్ ఐ-20 కారు టిజి09డి123, మారుతీ స్విఫ్ట్ కారు ఏపి09బిడబ్ల్యు4066లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి మొత్తం విలువ 15 లక్షలు ఉంటుందని తెలిపారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకోని తదుపరి విచారణ నిమిత్తం శంషాబాద్ పోలీసులకు అప్పగించామని మరో నిందితుడి కోసం గాలిస్తున్నామన్నారు.

డ్యూటీ ఫ్రీ మద్యాన్ని పట్టుకున్న ఎక్సైజ్ సిబ్బందిని డిటిఎఫ్ ఇతర అధికారులను ఎక్సైజ్ ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టర్ వివి కమలహాసన్‌రెడ్డి, ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ రంగారెడ్డి ధశర్యద్, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి శంషాబాద్ కృష్ణప్రియ, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.శ్రీని వాస్‌రెడ్డిలు అభినందించారు. మద్యం పట్టుకున్న టీంలో డిటిఎఫ్ శంషాబాద్ బృందం, ప్రొహిబిషన్ ఎక్సైజ్ బి.ప్రవీణ్‌కుమార్, జి.శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY









# శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో కలశాభిషేకం

**యాదాద్రి భువనగిరి బ్యూరో, (వార్త వేదిక సూర్య):**
శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో సహస్ర కళాశాభిషేకము 1246 కలశంలతో నిర్వహించారు. స్వామివారికి భక్తుల స్వహస్తములచే అయ్యప్ప స్వామికి అభిషేకాలు బ్రహ్మశ్రీ వెంకటేశ్వర శర్మ ప్రధాన తాంత్రికర్యులు వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణలతో అత్యంత వైభవోపేతంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పూజలు ముగింపు కార్యక్రమంలో భాగంగా శ్రీ సుదర్శన హెూమం పూర్ణాహుతి, ధ్వజ అవరోహణము, మైసి సంవారము, కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో అయితరాములు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ అయిత రాములు, మున్సిపల్ చైర్మన్ , పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ మాయ దశరథ కౌన్సిలర్ రత్నపురం బలరాం, బిజెపి జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, బుక్క శ్రీనివాస్ ,వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఇరుకుల రామకృష్ణ గారు బెల్దే వెంకటేష్ ప్రధాన కార్యదర్శి దిడ్డి సత్యం, గురు స్వామి కోశాధికారి శ్యాంసుందర్ ఘటాని,చీకటిమల్ల రాములు గురుస్వామి పాలకుర్తి వేణుమాధవ్ , అయితే శ్రీనివాస మంచుకొండ వినోద్, పసుపు నూరి నాగభూషణం గాద శ్రీనివాస్ చింత రవి, రావుల శ్రీధర్ చందా మహేందర్ గుప్తా కొడిత్యాల నాగరాజు, తన్నీరు శ్రీనివాస, జిల్లా వెంకటరమణ ఎర్రం రాజు శంకర్ పోకల సోమన్న జీడిగం లక్ష్మయ్య. సుగ్గుల చంద్రశేఖర్, ఇరుకులశ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానం నందు సహస్ర కళాశాభిషేకము 1246 కలశంలతో స్వామివారికి భక్తుల స్వహస్తములచే అయ్యప్ప స్వామికి అభిషేకాలు బ్రహ్మశ్రీ వెంకటేశ్వరశర్మ ప్రధాన తాంత్రికర్యులు గారి దివ్య కరకమలములచే మరియు వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణలతో అత్యంత వైభవోపేతంగా కార్యక్రమం నిర్వహించబడింది మరియు మండల పూజలు ముగింపు కార్యక్రమంలో భాగంగా శ్రీ సుదర్శన హెూమం పూర్ణాహుతి, ధ్వజ అవరోహణము, మైసి సంవారము, కార్యక్ర మాలు నిర్వహించబడ్డాయి ఈ కార్యక్రమాల్లో అయితరాములు ఆలయ వ్యవస్థాపక చైర్మన్, ఇట్టి కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ మాజీ చైర్మన్లు మంచాల ప్రభాకర్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ మాయ దశరథ కౌన్సిలర్ రత్నపురం బలరాం, బిజెపి జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, బుక్క శ్రీనివాస్ ,వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఇరుకుల రామకృష్ణ గారు బెల్దే వెంకటేష్ ప్రధాన కార్యదర్శి దిడ్డి సత్యం, గురు స్వామి కోశాధికారి శ్యాంసుందర్ ఘటాని,చీకటిమల్ల రాములు గురుస్వామి పాలకుర్తి వేణుమాధవ్, అయితే శ్రీనివాస మంచుకొండ వినోద్, పసుపు నూరి నాగభూషణం గాద శ్రీనివాస్ చింత రవి, రావుల శ్రీధర్ చందా మహేందర్ గుప్తా కొడిత్యాల నాగరాజు, తన్నీరు శ్రీనివాస, జిల్లా వెంకటరమణ ఎర్రం రాజు శంకర్ పోకల సోమన్న జీడిగం లక్ష్మయ్య. సుగ్గుల చంద్రశేఖర్, ఇరుకుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. దాదాపు 1200 మంది భక్తులు,బిక్ష స్వీకరించారు.

# మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

**సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 28(వార్త వేదిక సూర్య):**
స్వర్గీయ మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ అకాల మరణాన్ని చింతిస్తూ అశ్రునివాలు అర్పిస్తూ మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి సంతాపం ప్రకటిస్తూ సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేస్తూ ఆయన కాంగ్రెస్ పార్టీకి దేశానికి చేసిన సేవలు గుర్తుచేస్తూ ఘన నివాళులు అర్పించారు.

భారత దేశంలో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి ఆర్థిక శాఖ మంత్రిగా రిజర్వ్ బ్యాంకు గవర్నర్గా దేశప్రధానిగా ఈ దేశానికి చేసిన సేవలు గొప్ప పునాదులు వేశాయని ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చెప్పారు.

గ్రామ శాఖ అధ్యక్షుడు జక్కడి చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి కరెంటొతు బిక్షపతి నాయక్,కార్యదర్శి ఏపూరి



సతీష్,మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఎండి నయీమ్ షరీఫ్, రాసమల్ల యాదయ్య,మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ్మ, ఐఎన్టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ లింగస్వామి, కొత్తగూడెం గ్రామ శాఖ అధ్యక్షులు రాచకొండ శ్రీనివాస్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ ఏర్పుల సుదర్శన్, తుంబాయి తండా మాజీ సర్పంచ్ జరుపుల కవిత జగన్,కాట్రుతు రవీందర్ నాయక్, చండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పానుగోతు బాలు నాయక్,బీసీ సెల్ అధ్యక్షుడు రత్తుపల్లి యాదయ్య,మండల మహిళా కాంగ్రెస్ నాయకురాలు కొల్లోజు భాగ్యమ్మ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాచకొండ రమేష్ బాబు,నాతి లక్ష్మణ్ గౌడ్,సింగం కృష్ణ,చిలువేరు అంజయ్య,బల్గూరి శివ,గొల్లూరి నవీన్, చిలువేరు నరసింహ్మ,జక్కల శ్రీశైలం యాదవ్, శ్రీరాములు, చిలువేరు బిక్షమయ్య,నేనావత్ లక్ష్మణ్,కడారి శంకరయ్య,బద్దుల పెంటయ్య, గుండమల్ల బలరాం, కట్ట రాములు,కాట్రూట్ రాములు, యూత్ కాంగ్రెస్ మండల కార్యదర్శి ఉప్పల నాగరాజు, యూత్ కాంగ్రెస్ కార్యదర్శి కొండ నవీన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# దేశం దూరదృష్టి గల నాయకున్ని కోల్పోయింది

## మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు : టిపిసిసి డెలిగేట్ తంగేళ్లపల్లి రవికుమార్

**యాదాద్రి భువనగిరి బ్యూరో, (వార్త వేదిక సూర్య):**
మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం పట్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చిక్కుల వెంకటేష్ ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీసీసీ డెలిగేట్ సభ్యులు తంగళ్ళపల్లి రవికుమార్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ దేశం దూరదృష్టి గల నాయకున్ని కోల్పోయిందని, ఆర్థికవేత్తగా, రాజనీతిజ్ఞుడిగా భారతదేశ పురోగతికి ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన మన్మోహన్ సింగ్ లేని లోటును ఎవరు పూడ్చలేరని అన్నారు. దేశానికి మన్మోహన్ సింగ్ చేసిన కృషి, దేశ అభివృద్ధిలో ఆయన పాత్ర ఎప్పటికీ గుర్తుండి పోతుందన్నారు. మన్మోహన్ సింగ్ మరణంతో కాంగ్రెస్ పార్టీ ఒక సుశిక్షితుడైన సైనికుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నిర్ణయమే తన నిర్ణయంగా శిరసావహించిన మన్మోహన్ సింగ్ గారు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు హక్కుగాకల్పించిన ఘనత మన్మోహన్ సింగ్కి దక్కుతుందన్నారు.




విద్యా హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, ఆహార భద్రత చట్టం, ఉపాధి హామీ చట్టం వంటి ఎన్నో చట్టాలు ప్రధాని మన్మోహన్ సింగ్ కాలంలోనే అమల్లోకి వచ్చాయని గుర్తు చేశారు.
దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. మన్మోహన్ సింగ్ గారి చిత్తశుద్ధి, ప్రజాసేవ పట్ల అంకితభావం మనందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. ఈ విషాద తరుణంలో ఆయన కుటుంబ సభ్యులకు, ఆత్మీయులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో , టి పి సి సి మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ రఫీ ఉద్దీన్ గౌరీ , జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిట్టి , భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ బాబురావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రంగా కృష్ణ, మాజీ ఎంపీపీ తోటకూరి వెంకటేష్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భూచాలా స్వామి, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చుక్క స్వామి, గుమ్మడల్లి రమేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మంగా ప్రవీణ్, అసెంబ్లీ అధ్యక్షుడు వాసుదేవ్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు గోదా చిన్న శ్రీనివాస్ గౌడ్, గోమారి ఎల్లారెడ్డి, ఆదర్శ రైతు సంఘం అధ్యక్షులు ములుగు లక్ష్మయ్య, కొత్త బాల్రాజ్, మైనారిటీ నాయకులు షేక్ షానూర్ బాబా, మొహమ్మద్ కరీం, మొహమ్మద్ హుజూర్ అహ్మద్, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పోగుల యాదగిరి, పెండం సుదర్శన్, శ్రీనివాస్ మెడిగే, హమాలీ సంఘం నాయకులు తుమ్మల రాజు కార్మిక నాయకులు హమాలీ సంఘం నాయకులు ఘనంగా నివాళులర్పించి సంతాప ప్రకటించారు.

# భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించిన బ్రాహ్మణపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వుట్ల బిక్షం నాయకులు, కార్యకర్తలు

**గుండాల, డిసెంబర్ 28(వార్త వేదిక సూర్య):**
శుక్రవారం బ్రాహ్మణపల్లి గ్రామం నందు భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అనారోగ్యంతో మృతి చెందారు ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. వుట్ల బిక్షం మాట్లాడుతూ దేశం ఆర్థికంగా క్లిష్ట సమయంలో వున్నప్పుడు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తెచ్చిన ఆర్థిక సంస్కరణలను అమలు చేయడంలో ఆర్థికరంగ నిపుణుడుగా తన విద్వత్తును ప్రదర్శించారని కొనియాడారు.పీవీ మనసు గెలిచిన మన్మోహన్ సింగ్ అనేక ఉన్నత శిఖరాలకు చేరుకున్న భరతమాత ముద్దుబిడ్డగా కొనియాడారు.



మిత భాషిగా, అత్యంత సౌమ్యుడుగా, జ్ఞానాన్ని సొంతం చేసుకున్న స్థిత ప్రజ్ఞత కలిగిన నేతగా, భారత ప్రధానిగా మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలు గొప్పవి అన్నారు.
2014 లో బిజెపి చేసిన బలహీన ప్రధాని అనే విమర్శలకు కౌంటర్ ఇచ్చాడు. నేను వీక్ పీఎం కానేకాదు. పరిస్థితులకు అనుగుణంగా బాగానే పనిచేశా.సమకాలీన మీడియా కంటే చరిత్ర నన్ను దయతో గుర్తుపెట్టు కుంటుంది.గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ప్రజలకు పని కల్పిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని మన్మోహన్ సింగ్ హయాంలోనే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ నాయకులు వుట్ల రవి,పరిశురాములు,మాజీ సర్పంచ్ ముత్యం యాదయ్య,రాపోలు అశోక్, అంజయ్య, చెన్నయ్య, గువ్వల స్వామి,మరోజు యాదగిరి, తాళ్లపల్లి యాదగిరి,పాపయ్య, అంజయ్య, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ సిబ్బంది అందర్నీ పర్మినెంట్ చేయాలి

## తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ ఎంపీడీవో ముందు ధర్నా

**సంస్థాన్ నారాయణపురం,డిసెంబర్ 28(వార్త వేదిక సూర్య):**
గ్రామ పంచాయతీ సిబ్బంది వాటర్ మైన్ ఎలక్ట్రిషన్ కామాటి కారోబార్ బిల్ కలెక్టర్ ట్రాక్టర్ డ్రైవర్ కంప్యూటర్ ఆపరేటర్ వివిధ కేటగిరీల సిబ్బంది ఎంపీడీవో ఆఫీసుల ముందు ధర్నా కార్యక్రమాలలో పాల్గొనాలి అనంతరం 28 తేదీన కలెక్టర్ ముందు ధర్నా ఉంటుంది కావున వివిధ కేటగిరీల ఉన్న సిబ్బంది 17 మండలాల నుండి అందరూ గ్రామపంచాయతీ కార్మికులు అందరూ పాల్గొనాలి. గ్రామపంచాయతీ సిబ్బంది అందర్నీ పర్మినెంట్ చేయాలి.. జీవో నెంబర్ 51ని సవరించాలి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి కేటగిరీల వారీగా వేతనాలు అమలు చేయాలి 11వ పి ఆర్ సి ప్రకటించిన విధంగా జీవో నెంబర్ 60 ప్రకారం గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి కార్మికుల వేతనాలకు ప్రభుత్వమే ప్రత్యేక గ్రాండ్ విడుదల చేయాలి



కారోబార్ బిల్ కలెక్టర్ లకు సహాయ కార్యదర్శిగా ఇవ్వాలి

బకాయి వేతనాలు చెల్లించాలి ప్రభుత్వం స్పందించి తక్షణమే గ్రామపంచాయతీ కార్మిక ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపాలని లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన పోరాటాలతో పాటుగా నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నామని తెలియజేస్తున్నాము గ్రామపంచాయతీ సిబ్బంది అన్ని మండలాలలో సమ్మె విజయవంతం చేయాలని కోరుచున్నాను అదేవిధంగా 28. 12 .20 24 రోజున కలెక్టర్ ఆఫీసు 17 మండలాల నుండి గ్రామపంచాయతీ సిబ్బంది అందరూ చేరుకొని విజయవంతం చేయాలి ఈ కార్యక్రమానికి గౌరవాధ్యక్షులు దాసరి పాండు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ళ గణపతి రెడ్డి రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ జిల్లా అధ్యక్షులు బందెల బిక్షం జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం ఈశ్వరయ్య ముఖ్యఅతిథిగా పాల్గొంటారని గ్రామపంచాయతీ జేఏసీ మండల అధ్యక్షులు గుడేటి పాపయ్య తెలిపారు






# బాధితునికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

## చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గడ్డం రవి

**సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 28(వార్త వేదిక సూర్య):**
మండలంలో ని జనగాం గ్రామంలో మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గ్రామానికి చెందిన తండా జంగయ్య కు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ పేద ప్రజల అభివృద్దే ప్రధాన లక్ష్యంగా ప్రజా పాలన కొనసాగుతుందని పార్టీలకు అతీతంగా కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్క నిరుపేద కుటుంబానికి ఆసరాగా సీఎం రిలీఫ్ ఫండ్ అందుతుందని అన్నారు.అదేవిధంగా మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఏ పేదవారికి ఆపద వచ్చినా మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో సహా సహకారాలు ఎల్లప్పుడూ అందుతాయని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఒక ధైర్యం, ఒక భరోసా అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జనగాం గ్రామ శాఖ అధ్యక్షులు గడ్డం రవి, మునుగోడు నియోజకవర్గ ఐఎన్టీయూసీ అధ్యక్షులు ఎస్కే బడేసాబ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కైసర్,మాజీ సర్పంచ్ గడ్డం శంకరయ్య, సీనియర్ నాయకులు ఎర్ర లక్ష్మయ్య, గడ్డం మల్లయ్య,యువజన కాంగ్రెస్ నాయకులు బైకని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శ్రమ నీ ఆయుధమైతే విజయం నీ బానిస అవుతుంది

**గుండాల, డిసెంబర్ 28(వార్త వేదిక సూర్య):**
గుండాల సుద్దాల గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి బుర్ర నరేష్ గౌడ్ నిరుపేద కుటుంబంలో జన్మించి కఠిన పేదరికం సైతం లెక్కచేయకుండా దీక్షతో ఉన్నత విద్యను అభ్యసించి ఈరోజు కానిస్టేబుల్గా రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి కానిస్టేబుల్గా పదోన్నతి పొందిన సందర్భంగా పలువురు గ్రామ ప్రముఖులు బంధువులు సంతోషం వ్యక్తం చేశారు బుర్ర నరేష్ గౌడ్ నిరుపేద గీతా కార్మిక కుటుంబంలో జన్మించి చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి తీవ్ర కష్టాలను అనుభవిస్తూ ఉన్నత చదువులు అభ్యసిస్తూ ఆర్థిక వనరుల కోసం ఒకానొక సందర్భంలో



గీత వృత్తిని నమ్ముకొని జీవనం కొనసాగించాడు కఠినమైన పేదరికానికి బానిస కాకుండా కటోర శ్రమకు రాజై శ్రమించి ఈరోజు కానిస్టేబుల్గా నియమింపబడడం సంతోషకరమని పలువురు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

# దొడ్డి కొమరయ్య విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని ఆహ్వానిస్తున్న నాయకులు

**సంస్థాన్ నారాయణపురం,డిసెంబర్ 28(వార్త వేదిక సూర్య):**
తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ఉద్యమాల తొలి అమరుడు. వీరోచితమైన పోరాడి వెట్టి చాకిరి విముక్తి కోసం అలుపెరుగని వీర యోధుడు ఉద్యమంలో



వెనుదురుగని వీరుడు ఆయన ఆశయ సాధన కోసం 29 . 2024 ఆదివారం రోజున మండలంలోని మల్లారెడ్డి గూడెం గ్రామంలో దోడ్డి కొమరయ్య గారీ విగ్రహ ఆవిష్కరణ ఉత్సవానికి ముఖ్యఅతిథిగా మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి గారిని. ఆహ్వానించడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శ్రీను నాయక్, ఘనం అంజయ్య, నర్రి లింగస్వామి, నర్రి సత్తయ్య, నర్రి లింగం పాల్గొన్నారు.

# గోపరాజుపల్లిలో సిపిఐ శత జయంతి ఉత్సవాలు

**రామన్నపేట, డిసెంబర్ 27 (వార్తా వేదిక సూర్య):**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని గోపరాజు పల్లి గ్రామంలో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి సలిగంజి కృష్ణ కుమార్ ఆధ్వర్యంలో సిపిఐ శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ 1925 డిసెంబర్



22న కాన్పూర్లో సిపిఐ ఆవిర్భవించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సలిగంజి వీరస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, ప్రజానాట్యమండలి నాయకులు కట్ల యాదగిరి, యాస జనార్ధన్ రెడ్డి ,దొండ నరసయ్య, పాలకుల రఘు, ఏనుగుల బచ్చయ్య, రాములు ,సంగిశెట్టి మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY






## కెజిబివిలకు ఉపాధ్యాయుల డెప్యుటేషన్లు విరమించుకోవాలి

**సమగ్ర శిక్ష ఉద్యోగులు, సిఆర్టీల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలి**

**ఆత్మకూర్ (ఏం) డిసెంబర్ 28(వార్త వేదిక సూర్య):** సమ్మె చేస్తున్న కెజిబివి ఉపాధ్యాయుల స్థానంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల డెప్యుటేషన్లు విరమించుకోవాలని, గత పద్దెనిమిది రోజులుగా సమ్మె చేస్తున్న కెజిబివి, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు ఉద్యోగుల మస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టిఎస్ యుటిఎఫ్ డిమాండ్ చేసింది.
రాష్ట్రంలో అత్యధికంగా శ్రమదోపిడీకి గురౌతున్నది ఈ ఉద్యోగులేనని, చేస్తున్న పనికి సమానమైన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం వారు పనిచేస్తున్న పోస్టు యొక్క మూల వేతనం ఇవ్వాలని మాత్రమే వారు కోరుతున్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, మొదటి పీఆర్సీ సిఫారసు మేరకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సెలవులు, ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరుతున్నారు. న్యాయమైన సమస్యలను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా ఏమాత్రం పట్టించుకోవటం లేదని ఆవేదన చెందుతున్నారు. ఆ క్రమంలోనే ఉద్యోగులు స్వచ్ఛందంగా నిరవధిక సమ్మెకు దిగారు. కెజిబివి, యుఆర్ఎస్, ఆశ్రమ పాఠశాలల్లో పిల్లలకు విద్యాబోధన కుంటుపడింది. శుక్రవారం నుండి సమ్మెను ఉధృతం చేస్తామని వారు ప్రకటించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రతిష్టకు పోకుండా చర్చలు జరిపి, సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని టీ స్ యు టీ ఫ్ జిల్లా కార్యదర్శి కొణతం శ్రీనివాస్ ఆత్మకూర్ మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరూర్ ఎల్లయ్య ,దొడ్డి రవి ,ఉపాధ్యక్షులు ఎలిమినేటి సోమయ్య ,యాదమ్మ, కోశాధికారి గడ్డమీది శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

## స్వర్గీయ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించిన మండల కాంగ్రెస్ నాయకులు

**ఆత్మకూర్ (ఏం) డిసెంబర్ 28 (వార్త వేదిక సూర్య):** మాజీ ప్రధాని స్వర్గీయ శ్రీ మన్మోహన్ సింగ్ స్వర్గస్తులు కావడంతో ఆత్మకూరు ఎం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ సందర్బంగా మాట్లాడుతూ... భారత దేశ ఆర్థిక సంస్కరణలకు ఆద్యం పోసిన మహనీయుడు స్వర్గస్తులు కావడం



దేశానికి తీరని లోటు అన్నారు. వారి సేవలు ఎప్పటికి మరిచిపోలేం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్దులు, నాయకులు కట్టేకొల హన్మంత్ గౌడ్,బత్తిని ఉప్పలయ్య గౌడ్ నాగం లక్ష్మారెడ్డి,జన్నాయికోడె నగేష్,పోతగాని మల్లేశం గౌడ్ నోముల వెంకటరెడ్డి, పంజాల నర్సయ్య గౌడ్, ఏద్దు వెంకన్న, పైళ్ల దామోదర్ రెడ్డి,ఎలాగందుల మహేష్,తవిటి రాములు,రంగ స్వామి, పాశం అనంతరెడ్డి,ఎలాగందుల శ్రీను, మోలుగు ఉపేందర్, నాగం మధు, హార్నాదం, మురళి, నగేష్,వెంకటేష్ గౌడ్,మల్లేశం, శేఖర్, యాదగిరి, శేఖర్, రాజు, పరుశరాములు, గణేష్, విద్య సాగర్,శ్రీకాంత్,సారయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి

**భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 27, (వార్త వేదిక సూర్య):** పట్టణ కేంద్రంలో నేతాజీ చౌరస్తా వద్ద పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంన భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు



నాయకులు ఘన నివాళులు అర్పించారు. దేశానికి ప్రధానిగా, ఆర్థికవేత్తగా పలు సేవలు అందించారని ఆయన చేసిన సేవలు పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవ కుమార్, నాయకులు కొట్టం కరుణాకర్ రెడ్డి , పాక జంగయ్య, మచ్చేందర్, మక్తాల వెంకటేష్, ఎజాస్, రామాంజనేయులు, కడవేరు వెంకటేష్, రమేష్, చింతల శ్రీశైలం, కొండమడుగు రాజు, వేమన రెడ్డి, రేవల్లి యాదయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు శ్రద్ధాంజలి ఘటించిన కాంగ్రెస్ నేతలు

**రామన్నపేట :డిసెంబర్ 27( వార్తా వేదిక సూర్య):** రామన్నపేట మండల కేంద్రంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల స్థానిక రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు మన్మోహన్ సింగ్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని అశ్రునయనాలతోని శ్రద్ధాంజలి సంతాపం తెలియజేశారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జమీరుద్దీన్ మాట్లాడుతూ రెండు పర్యాయాలు ప్రధానమంత్రిగా చేసి భారత ఆర్థిక వ్యవస్థను ఘాడిలో పెట్టినటువంటి ఆర్థికవేత్త ను భారతదేశం కోల్పోవడం ఎంతో బాధాకరమని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోదాస్ పృధ్వి రాజ్, వనం చంద్రశేఖర్, మహమ్మద్ నాసర్ ,జిల్లా వెంకటేశం ,కొత్త పెల్లి అబ్రహం కుమార్ ,ఎండి బషీర్ దౌల, పూస బాల నరసయ్య ,పెద్ద బోన వెంకటేశం, మహమ్మద్ ఆకరం, మోటి రమేష్ ,కోట సుధాకర్ ,రాపోల్ రాజశేఖర్, గురుకుశివ, సంగిశెట్టి సుదర్శన్, మోటే మహేష్, మొహమ్మద్ రిజ్వాన్, మహమ్మద్ అజార్ ,రాజు పెద్దలు కక్కిరేణి రవీందర్, మీర్జా ఖదీర్ బేగ్ ,మహమ్మద్ జానీ తదితరులు పాల్గొన్నారు.



## మోటకొండూరులో గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో టోకెన్ సమ్మె

**గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి గ్రాంట్ ద్వారా వేతనాలు చెల్లించాలి**

**పాల్గొన్న సిపిఎం జిల్లా కమిటి సభ్యులు బోలగాని జయరాములు,మండల కార్యదర్శి కొల్లూరి ఆంజనేయులు**

**మోటకొండూరు/వార్త వేదిక సూర్య :** సిఐటియు మూటకొండూరు మండల కమిటీ ఆధ్వర్యంలో తెలం గాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులు మండల కేంద్రంలో బస్టాండు ఆవరణలో తమ సమస్యలు పరిష్కరించాలని కనీస వేతనం అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో టోకెన్ సమ్మె పిలుపులో భాగంగా సిఐటియు మండల కన్వీనర్ వడ్డెబోయిన మహేందర్,జిపి సంఘం మండల అధ్యక్షులు పరమేష్ అధ్యక్షతన సమ్మె నిర్వహించారు, ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొలగాని జయరాములు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కొల్లూరు ఆంజనేయులు పాల్గొని సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీలలో 63 వేల మంది పైచిలుకు కార్మికులు బడుగు బలహీన వర్గాలకు చెందినవార పనిచేస్తున్నారని వారి సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం అతి తక్కువ
వేతనం చెల్లించి వారి శ్రమను దోచుకుంటుందని వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ,ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ప్రభుత్వ గ్రాంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని గ్రామపంచాయతీలు



పుట్టినప్పటి నుండి గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎలాంటి అపరిశుభ్రత లేకుండా కాలనీలు పరిశుభ్రంగా ఉంచుతున్నారని ప్రజలు దోమలు ఈగల బారిన నుండా పడకుండా కాపాడుతూ ప్రజలకు సహకరిస్తున్నారని, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నప్పటికీ గ్రామ పంచాయతీ కార్మికులను సమస్యలు పట్టించుకోవడంలేదని విమర్శించారు. గతంలో మూడుసార్లు రాష్ట్రవ్యాప్తంగా నిరవధికసమ్మె చేసి 9500 కనీస వేతనం పోరాడి సాధించుకున్నారని గుర్తు చేశారు వారిని శాశ్వత ఉద్యోగులుగా ప్రకటించాలని మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించి జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం 26, వేలు అమలు చేయొచ్చని ప్రభుత్వానికి సూచించారు .వీరి సమస్యలు పరిష్కరించేంతవరకు ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధంగా ఉన్నామని కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. రేపటి రోజున రెండవ రోజు టోకెన్ సమ్మె యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.
ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి బోగారం వీరస్వామి ఆడేపు ఇస్తారి మారబోయిన అశోక్ కాశగాల్ల రవి బైరపాక సర్వయ గంధముల నరసింహ బొట్ల గణేష్ పల్లె మనెమ్మ బొట్ల అరుణ గంధ మల్ల భాగ్యమ్మ పెద్దలు తిరుమలమ్మ నరసింహ యాదయ్య కృపాకర్ రాములు చంద్రమ్మ భద్రమ్మ లక్ష్మీ నరసింహ మైసయ్య గడ్డం అంజయ్య బిక్షపతి కవిత మార్కమ్మ ఎల్లమ్మ జంగమ్మ బాబు వెంకటేష్ సత్తయ్య రాములు బాలయ్య తదితరులు పాల్గొన్నారు .

## విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వెయ్యాలి

**పివైఎల్ పట్టణ ప్రధాన కార్యదర్శి పగడాల శివ**

**భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 27, (వార్త వేదిక సూర్య):** గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి విద్యార్థుల ఉజ్వల భవిష్యతు కై బంగారు బాటలు వెయ్యాలని ప్రగతిశీల యువజన సంఘం (పి వై ఎల్) పోచంపల్లి పట్టణ కార్యదర్శి పగడాల శివ అన్నారు. శుక్రవారం భూదాన్ పోచంపల్లి మండలం దేశ్ముఖి గ్రామంలోని గురుకుల పాఠశాలలో పిడిఎస్‌యు, పివైఎల్ ఆధ్వర్యంలో సర్వే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో వంట గదులు, వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లో వార్డెన్ లేకపోవడంతో టీచరే వార్డన్‌గా వ్యవహరిస్తున్నారని అన్నారు. నైట్ టైం వాచ్మెన్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వంటగదికి పైకప్పు సరిగా లేకపోవడంతో కోతులు వంట వస్తులను పాడు చేస్తున్నాయని, టీచింగ్ నాన్ టీచింగ్ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వంట చేసే వారికి సకాలంలో బిల్లులు రావడంలేదని , ప్రతి సబ్జెక్టుకు ప్రత్యేక టీచర్ లేకపోవడంతో విద్యార్థులు




ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు. గురుకులాల్లో సరైన వసతులు లేకపోవడం వలన విద్యార్థులు మరణిస్తున్న ప్రభుత్వం చోద్యం చూస్తు సినిమా ఇండస్ట్రీస్ వైపుకి ప్రజల ధ్యాసను మరలిస్తుందని అన్నారు.
రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాల్లోని సమ స్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని లేనిపక్షంలో సీఎం క్యాంప్ ఆఫీసును ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో పి ఈ టిచర్ శ్రీనివాసరావు, కుక్ మోతిలాల్ , వాచ్మెన్ సతీష్ వెంకటేశ్వర్లు, పోతగల నరసింహ , మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

## అబ్బాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడలు

**వార్తవేదిక సూర్య గుండాల డిసెంబర్ 27 :** మండలస్థాయి క్రీడలు వాలీబాల్ కబడ్డి మన ఊరు మన ఆట మన పాట మరియు చాలా సంతోషం.. ఈ సందర్భంగా ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఈరసరపు యాదగిరి గౌడ్ మాట్లాడుతూ క్రీడలతో యువతకు మానసిక ఉల్లాసం.నూతన సంవత్సర,సంక్రాంతి పండుగ సందర్భంగా భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కొనసాగించాల్సిన బాధ్యత మనందరిది పోటీలు మన తెలుగువారి సాంప్రదాయమని మరియు వాటిని కొనసాగించుట మన బాధ్యత అని తెలియజేశారు.
స్కూల్ ఆధ్వర్యంలో క్రీడల టోర్నమెంట్‌లో పాల్గొని



క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలు ఆడటం వల్ల క్రీడాకారులకు మానసిక ఒత్తులు దూరమవుతాయని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని ఇలాంటి క్రీడలను ప్రోత్సహిస్తున్న అబ్బాస్ పౌండేషన్ వారిని, కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో క్రీడాకారులు అబ్బాస్ పౌండషన్ మబ్బు మహేష్,యుత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు యామగని బాలు గౌడ్,యమగాని చందు, బత్తినీ భరత్, బండారి రమేష్, యామగని మధు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## అయ్యప్ప దేవాలయంలో అన్న ప్రసాద వితరణ

**మనలను కాపాడే దేవుళ్ళు మన గ్రామ దేవుళ్ళు**

**చౌటుప్పల్, డిసెంబర్ 27 (వార్త వేదిక సూర్య):** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ అయ్యప్ప దేవాలయంలో శుక్రవారం మంచికంటి భాస్కర్ గుప్తా - ప్రమీల
మంచికంటి వెంకటేశ్ - రాజేశ్వరి కుమారుడు ఆశిక్ సాయి
స్వర్గీయ డాకోజి రామకృష్ణ జ్ఞాపకార్థం వారి ధర్మపత్ని డాకోజి లక్ష్మి వారి కుమారుడు మని చరణ్ లు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు అన్నప్రసాద వితరణ దాతలు మాట్లాడుతూ మన భారతదేశంలో గ్రామ దేవతలకు ప్రాముఖ్యత ఉంది మన గ్రామాలను గ్రామ ప్రజలను కాపాడే తల్లి గ్రామ దేవత అన్నారు అయ్యప్ప స్వామి కేరళలో వారి ఇంటి విలవేల్పుగా ప్రతి ఇంట్లో భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు అయ్యప్పలకు అన్నప్రసాద వితరణ చేయడం వల్ల మాకు మా కుటుంబానికి స్వామివారి అనుగ్రహం ఎల్లప్పుడూ మాపై ఉండాలి ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దేవాలయం అధ్యక్షులు కామిశెట్టి భాస్కర్ గురుస్వామి వ్యవస్థాపక అధ్యక్షులు బొబ్బిళ్ళ మురళి ఉపాధ్యక్షులు తుర్పటి శంకర్ గురుస్వామి ప్రధాన కార్యదర్శి చింతల సాయిలు గురుస్వామి మరియు గురుస్వాములు దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి ఉప్పు ఆంజనేయులు అంతటి రాము





గౌడ్ సుక్క సుదర్శన్ పెద్దగోని రమేష్ గౌడ్ కంచరకుంట్ల వెంకట్ రెడ్డి కుంటల శశికాంత్ పల్సం రాజేష్ గౌడ్ గుండెబోయిన అంజయ్య యాదవ్ పాశం కృష్ణ చోల్లేటి గంట నాగరాజు పాశం సాయికిరణ్ కొలికిపోగు కిరణ్ తూర్పాటి వెంకటేష్ ప్రసాదం అనిల్ చెరుకుపల్లి వేణుమాధవ్ రెడ్డి కౌశిక్ రెడ్డి సుక్క రాంచరణ్ తూర్పాటి గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు

## అంబుజా సిమెంట్ పరిశ్రమ పనులు అడ్డుకున్న పర్యావరణ పరిరక్షణ వేదిక నాయకులు

**రామన్నపేట డిసెంబర్ 27 (వార్త వేదిక సూర్య):** ఆదాని అంబుజా సిమెంట్ పరిశ్రమ ప్రతిపాదిత స్థలంలో భారీ యంత్రాలతో పనులకు ప్రయత్నిస్తున్న సిబ్బందిని స్థానిక ప్రజలు,పర్యావరణ పరిరక్షణ వేదిక నాయకులు వెళ్లి అడ్డగించి వాహనాలను బయటకు తోలడం జరిగింది. యంత్రాల ముందు నిరసన తెలిపి అనంతరం యంత్రాలను వాహనాలను గేటు బయటకు తోలించి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ జల్లల పెంటయ్య, కో కన్వీనర్ ఎండి రెహాన్ మాట్లాడుతూ ఆదాని అంబుజా సిమెంట్ పరిశ్రమ నెలకొల్పాలని ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా ప్రజలందరూ 100% వ్యతిరేకించి రెండు నెలలు గడిచిన ఇప్పటికే ఏం ప్రకటించకుండా ఎలాంటి ప్రకటన చేయకుండా గుట్టు చప్పుడు కాకుండా భారీ యంత్రాలతో పనులు ప్రారంభించాలని చూస్తున్నదని అన్నారు. అనంత పంపడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, నాయకులు బలగూరి అంజయ్య,కందుల హనుమంతు, కల్లూరి నగేష్, గొరిగె సోములు, ఎండి రషీద్,మునికుంట్ల లెనిన్, పులిబిక్షం, శానకొండ వెంకటేశ్వర్లు, బుర్ర శ్రీశైలం రేపాక




లింగస్వామి, మోటె నరేష్,పుట్టల ఉదయ్ కుమార్, గుండాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.






## మాలమహానాడు ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు నివాళులు

**నల్లగొండ టౌన్, డిసెంబర్ 28(వార్త వేదిక సూర్య):** నల్గొండలో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ చిత్రపటానికి మాలమహానాడు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాల మహానాడు సంక్షేమ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు రేఖల సైదులు మాట్లాడుతూ..భారత దేశంలో పేద,బడుగు,బలహీన వర్గాలకు మరియు రైతుల కొరకు ఎంతో కృషి చేసి తనదైన ప్రతిభ జ్ఞానంలో భారతదేశానికి ప్రధానిగా అపూర్వ సేవలందించిన మహానీయుడని ఆయన అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు మేకల కృష్ణయ్య జిల్లా అధ్యక్షులు తీగల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు

**కోమటిరెడ్డి సేవాసమితి అధ్యక్షులు కృష్ణ వికాస్ మేకల కృష్ణయ్య**



**నల్లగొండ టౌన్, (వార్త వేదిక సూర్య):** నల్గొండలోని కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో భారత మాజీ ప్రధాని మదన్మోహన్ సింగ్ చిత్రపటానికి కోమటిరెడ్డి సేవాసమితి అధ్యక్షులు కృష్ణ వికాస్ మేకల కృష్ణయ్య పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రముఖ ఆర్థికవేత్త, మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం తో దేశం ఒక గొప్పనాయకున్ని కోల్పోయిందని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను ప్రగతి పదములో ముందుండి నడిపించిన దూర దృష్టి కలిగిన నాయకుడు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని కొనియాడారు.

## మునవత్ ద్వాలి మృతి బాధాకరం

**దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**

**దేవరకొండ, డిసెంబర్ 28(వార్త వేదిక సూర్య):** దేవరకొండ నియోజకవర్గంలోని పిఏపల్లి మండలం పుట్టంగండి మాజీ ఉప సర్పంచ్ జాబర్ తల్లి మునవత్ ద్వాలి మృతి బాధాకరం అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.శుక్రవారం పుట్టంగండి గ్రామంలో ద్వాలి మృతి దేహానికి పూల




మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ద్వాలి కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్వాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ద్వాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఆయన వెంట ఏ పల్లి ఉమ్మడి మండల అధ్యక్షులు వెల్లుగురి వల్లపు రెడ్డి, బొడ్డుపల్లి మహేందర్, ఎర్ర యాదగిరి, రాయనబోయిన శ్రీను, కర్నాటి రవి కుమార్,వెంకట్రావు, బీమా, నార్య నాయక్, వెంకటయ్య,తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మద్దెలమ్మ తల్లి అనుగ్రహం పొందాలి

**బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ ?**

**మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**

**దేవరకొండ, డిసెంబర్ 28(వార్త వేదిక సూర్య):** కొండ పట్టణంలోన ప్రతి ఒక్కరు మద్దెలమ్మ తల్లి అనుగ్రహం పొందాలి అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.శుక్రవారం దేవరకొండ పట్టణంలోని మద్దెలమ్మ దేవాలయంలో మాజీ శాసన



సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని ఆయన అన్నారు.ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని అయన అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్‌ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, యాదవ సంఘము నాయకులు,తదితరులు ఉన్నారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించి కార్మికులని ఆదుకోవాలి

**పాలడుగు నాగార్జున కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు**




**నల్లగొండ టౌన్, డిసెంబర్ 27(వార్తా వేదిక సూర్య):** గ్రామపంచాయతీ కార్మికులకు నెలల తరబడి వేతనాలు రాక అర్థాకలితో అలమటిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కార్మికుల వేతనాలు చెల్లించి కార్మికులను ఆదుకోవాలని కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర జేఏసీ డిసెంబర్ 27 28 తేదీల్లో టోకెన్ సమ్మె పిలుపులో భాగంగా గ్రామపంచాయతీ కార్మికులు విధులు బహిష్కరించి నల్లగొండ మండలం ఎమ్మార్వో కార్యాలయం ముందు సమ్మె నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ఈ సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ పాల్గొన్న ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కార్మికులు ఉదయాన్నే నాలుగు గంటలకు లేసి పనిగంటలతో నిమిత్తం లేకుండా రాత్రి వరకు పనిచేస్తూ అత్యధిక శ్రమదోపిడికి గురవుతున్న వర్గం గ్రామపంచాయతీ కార్మికులని అలాంటి గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చేదే అతి తక్కువ వేతనం ఈ వేతనం నెలల తరబడి పెండింగ్లో ఉండడం వలన కార్మికులు ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామంలోని ప్రజలను రోగాల బారిన పడకుండా ఉండడానికి అనేక రకాల పనులు నిర్వహిస్తూ గ్రామాన్ని సర్వాంగ సుందరంగా ఉంచడంలో అవార్డులు తీసుకు రావడంలో గ్రామపంచాయతీ కార్మికుల కృషి ఎంతో అమోఘం అని కొనియాడారు. గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న సిబ్బంది అత్యధికులు దళిత బహుజనులేనని అన్నారు .గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాములో కార్మికులు 34 రోజులు సమ్మె చేసిన సమయంలో కాంగ్రెస్ నాయకులు సమ్మె శిబిరాలను సందర్శించి గ్రామపంచాయతీ కార్మికులు అత్యధిక శ్రమ దోపిడికి గురవుతున్నారని కాంగ్రెస్కు ఓట్లు వేసి గెలిపిస్తే అధికారంలోకి రాగానే గ్రామపంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని పేస్కేల్ అమలు చేస్తామని హామీ ఇచ్చి సంవత్సర కాలం పూర్తయి నప్పటికిని పిల్లి చస్తే గోడౌతల పడేసిన చందంగా కార్మికుల పట్ల ప్రభుత్వ తీరు ఉన్నదని అన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని అన్నారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు పోలే సత్యనారాయణ మాట్లాడుతూ.. కార్మికులందరినీ పర్మినెంట్ చేసి రిటైర్మెంట్ బెనిఫిట్ గా 5 లక్షల రూపాయలు ఇవ్వాలని, ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని ఫిబ్రవరి బడ్జెట్ సమావేశాలలో గ్రామ పంచాయతీ కార్మికులు అందర్నీ పర్మినెంట్ చేయాలని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలు ఈ టోకెన్ సమ్మెతో పరిష్కరించకపోయినట్లయితే రాబోయే రోజులలో నిరవధిక సమ్మెలోకి వెళ్లడానికి కార్మికులు వెనకాడబోరని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి బొల్లు రవీంద్ర కుమార్ యూనియన్ జిల్లా సోషల్ మీడియా బాధ్యులు ఇరిగి ఎల్లేష్, మండల నాయకులు దున్న అనిల్ కుమార్, బక్కతోళ్ళ రేణుక, పోలే నాగమణి, బోగరి సైదులు, కుడతాల లింగమ్మ, మేకల నరసింహ, పెరిక రాంబాబు, కళావతి, సమీనా, గోరిబి, కాష్మల్ల రవి, శ్రీను, కట్ట నరసింహ, లక్ష్మయ్య, శ్రీకాంత్, వెంక టయ్య, కళ్యాణి, జయమ్మ, భాగ్యమ్మ, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు

**- మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాచకొండ రమేష్**



**నల్లగొండ టౌన్,డిసెంబర్ 28(వార్త వేదిక సూర్య):** భారత మాజీ ప్రధానమంత్రి, దేశ ఆర్థిక సంస్కరణ రూపకర్త డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరనిలోటని అడ్డగూడూరు మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాచకొండ రమేష్ అన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ శ్రేణులందరూ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణంతో దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందని అన్నారు. వారు ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడే దేశంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని, ఒక ఆర్థిక వేత్తగా, ఒక అధ్యాపడిగా, రిజర్వు బ్యాంకు గవర్నర్ గా, రాజ్యసభ సభ్యుడిగా, ప్రతిపక్ష నాయకుడిగా, ప్రధానమంత్రిగా దేశానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. యూపీఏ ప్రభుత్వానికి నాయకత్వం వహించి పదేళ్ల పాటు ప్రధానమంత్రిగా వారు దేశంలో అనేక వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం పూడ్చలేనిదని వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వల్లంభట్ల రవీందర్ రావు, మాజీ ఎంపీటీసీ గూడేపు పాండు, బొమ్మగాని లక్ష్మయ్య, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కడారి రమేష్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు నాగులపల్లి రమేష్, సీనియర్ నాయకులు గూడేపు నాగరాజు, ఆసర్ల మచ్చగిరి, గూడేపు బాబు, పొన్నాల వెంకన్న యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి మల్లేష్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కప్పల రాజేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు పూలపల్లి రాజశేఖర్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు ఎండీ షకీల్, పిల్లి సోమయ్య, రేఖల సోమయ్య, బీరప్ప, బీరుమల్లు, మల్లుస్వామి, పూజారి నాగరాజు, మందుల వెంకటేష్, మహేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇరిగి నాగార్జున మృతి పార్టీకి లోటు

**ఇరిగి నాగార్జున మృతి బాధాకరం**

**నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**



**దేవరకొండ, డిసెంబర్ 28(వార్త వేదిక సూర్య):** దేవరకొండ నియోజకవర్గం లోని చింతపల్లి మండలం వింజమూరు గ్రమానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు ఇరిగి నాగార్జున మృతి పార్టీకి లోటు అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.

శుక్రవారం వింజమూరు గ్రామంలో నాగార్జున మృతి దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాగార్జున కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పరామర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరిగి నాగార్జున మృతి బాధాకరం అని ఆయన అన్నారు. నాగార్జున కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఆయన వెంట దండేకర్ ప్రసాద్,అరెకంటిరాధాక్రిష్ణ,అరేకంటి జంగయ్య, రమావత్ బిచ్యా నాయక్, కోటేష్, మురళీ, విజయ్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ మద్దెలమ్మ తల్లి ఆలయానికి విగ్రహ ప్రతిష్ట మరియు 11వ వార్షికోత్సవం కార్యక్రమాల్లో పాల్గొన్న బి.ఆర్.ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్



**దేవరకొండ, డిసెంబర్ 28(వార్త వేదిక సూర్య):** దేవరకొండ పట్టణం లో 11 వ వార్డు కొలువైన శ్రీ శ్రీ మద్దేలమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మరియు 11 వ వార్షకోత్సవం కార్య క్రమంలో భాగంగా నర్మదేశ్వర శివలింగం ఆంజనేయస్వామి జంట నాగుల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట మహెూత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించిన బి.ఆర్.ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్ అనంతరం అమ్మవారికి ఆలయా కమిటి సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు.

## విద్యుత్‌ఘాతంతో మృతి చెందిన గోవింద్ కుటుంబాన్ని ఆదుకోవాలి

**బద్దెల గోవింద్ మృతి బాధాకరం**

**నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**



**దేవరకొండ,డిసెంబర్ 28(వార్త వేదిక సూర్య):** దేవరకొండ నియోజకవర్గంలోని నేరడుగొమ్ము మండలం కాచారాజుపల్లి గ్రామంలో విద్యుత్ ఘాతంతో మృతి చెందిన బద్దెల గోవింద్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.శుక్రవారం కరెంటు షాక్ తో మృతి చెందిన గోవింద్ దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి దేహానికి నివాళులర్పించారు. అనంతరం గోవింద్ కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పరామర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవింద్ మృతి బాధాకరం అని ఆయన అన్నారు.గోవింద్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.గోవింద్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఆయన వెంట వాడిత్య బాలు,రమావత్ తులిసిరామ్, వాడిత్య లాలు,తదితరులు పాల్గొన్నారు.




## ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి

**నల్గొండ జిల్లాలో బస్సుల సంఖ్య పెంచాలి**

**నల్గొండ ఆర్టీసీ డిఎమ్‌కి వినతి పత్రం అందజేత**

**ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్**

**నల్లగొండ టౌన్, డిసెంబర్ 27(వార్తా వేదిక సూర్య):** రాష్ట్ర ప్రభుత్వం నల్గొండ జిల్లా లో బస్సుల సంఖ్య పెంచాలి ప్రతి గ్రామానికి బస్సు నడపాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈరోజు నల్గొండ డి ఏమ్ ఆర్టీసీకి వినతి పత్రం అందజేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా



సంఘం ఐద్వా ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్గొండ బస్టాండులో సంతకాల సేకరణ చేశారు.ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందుకు స్వాగతిస్తున్నాం. అలాగే జిల్లా లోని ప్రతి గ్రామాల్లోకి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ముఖ్యంగా మహిళలు వృద్ధులు చిన్నపిల్లలు గర్భవతిలు స్త్రీలు ఎన్నో అవస్థలు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా మునుగోడు ప్రాంతాల్లో బస్ ప్రయాణం అసౌకర్యంగా ఉందని మరియు నల్గొండ టూ వయా తాటికల్ బస్సు నడపాలని తెలిపారు. నల్లగొండ నియోజకవర్గం లోని అన్ని గ్రామాలకు వెంటనే నూతన బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మి రాష్ట్ర కమిటీ సభ్యులు కొండా అనురాధ, జిట్ట సరోజ ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి, భూతం అరుణకుమారి, ఎస్కే సుల్తానా, జిల్లా కమిటీ సభ్యులు కనుకుంట్ల ఉమారాణి, జంజీరాల ఉమా తదితరులు పాల్గొన్నారు.






## కనీస వేతనాల కోసం టోకెన్ సమ్మె చేసిన జీపీ కార్మికులు

**చౌటుప్పల్, డిసెంబర్ 27 (వార్త వేదిక సూర్య):**
తమకు కనీస వేతనాలను అమలు చేయాలని, పెండింగ్ జీతాలను చెల్లించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చౌటుప్పల్ లో శుక్రవారం గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో టోకెన్ సమ్మె నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి పాషా, వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మాంద్ర శ్రీను, నాయకులు గుడ్డేటి పాపయ్య, ఆదిమూలం నందీశ్వర్, మహిళా కన్వీనర్ చెక్క ప్రమీల, ఎర్ర పెంటమ్మ, నవ్య, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయింది

**- కొండమల్లేపల్లి మాజీ వైఎస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు**

**దేవరకొండ డిసెంబర్ 27 న్యూస్ (వాస్తవ వేదిక సూర్య):**
భారతదేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందని కొండమల్లేపల్లి మాజీ వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు అన్నారు. భారత మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కరణ కర్త మన్మోహన్ సింగ్ చిత్రపటానికి స్థానిక శుక్రవారం అంబేద్కర్ చౌరస్తాలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం విపత్కర పరిస్థితిలో ఉన్న సమయంలో ఆర్థిక సంస్కరణలకు బాటలు వేసి భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన గొప్ప మహనీయుడు అని అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, ఆహార భద్రతా చట్టం, ఆధార్ కార్డు వంటి ఎన్నో సంస్కరణలు చేసిన మహనీయుడని కొనియాడారు. ఇంత గొప్ప వ్యక్తిని భారతదేశం కోల్పోవడం బాధాకరమన్నారు. మన్మోహన్ సింగ్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్ గౌడ్ ,కాంగ్రెస్ పార్టీ యువజన మండల అధ్యక్షుడు మూడవత్ మంగ్య నాయక్ ,ఇస్లావత్ సురేష్ నాయక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## మహానేతకు ఘన నివాళులు

**మిర్యాలగూడ డిసెంబర్ 27 (వార్త వేదిక సూర్య):**
మన భారతదేశ మాజీ ప్రధాని ఆర్థిక వేత్త డా,, మన్మోహన్ సింగ్ గారి అకాల మరణానికి సంతాపం ప్రకటిస్తూ మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (రాజీవ్ భవన్) నందు వారి చిత్ర పటానికి పూలమాలను వేసి ఘన నివాళులు అర్పించారు...

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ ప్రధానిగా నెహ్రూ గారి తర్వాత వరుగా 10 ఏళ్లు ప్రధానిగా చేసిన ఘనత మన మన్మోహన్ సింగ్ గారిది,1990 లో మన దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో చిక్కుకుపోతున్న సమయంలో ఆనాటి ప్రధాని పీవీ నరసింహారావు గారి నేతృత్వంలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించి దేశంలో ఆర్థిక



సంస్కరణలు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు ఆయన..

నిజానికి ఆనాడు వారు చేసిన సంస్కరణలే నేటి దేశ ఆర్థిక పురోగతికి పునాదులు అని అన్నారు. అంతే కాదు వారు ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లోని బడుగుబలహీనర్గాలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం తీసుకొచ్చిన ఘనత వారిది. అంతే కాదు మన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కూడా వారు ప్రధానిగా ఉన్నప్పుడు వారి నేతృత్వంలో తీసుకున్న నిర్ణయమే అని అన్నారు. ఇలాంటి మహనీయుడి కీర్తిని రానున్న తరాలకు తెలియజేస్తూ వారి ఆశయ సాధనలో మనం అందరం నడుచుకోవాలి అని అన్నారు..

ఇలాంటి మహనీయుడిని, ఆర్థికవేత్త నీ కోల్పోవడం మన దేశానికి, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్తలు మరియు బి ఎల్ ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

## నూతన షాదీఖానా నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి

**చౌటుప్పల్, డిసెంబర్ 27 (వార్త వేదిక సూర్య):**
చౌటుప్పల్ పట్టణంలో ఉన్న షాదీ ఖానా భవనం శిథిలావస్థకు చేరుకున్నందున నూతన భవనం నిర్మించేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం షాదీ ఖానా చైర్మన్ షేక్ కరీంలాల్ ఆధ్వర్యంలో మైనార్టీ నాయకులు హైదరాబాదులోని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నివాసంలో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ షాది ఖానా నిర్మాణం కోసం అవసరమైన ఏర్పాట్లను పరిశీలించాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ బాబా షరీఫ్, మాజీ షాది ఖానా చైర్మన్ ఎజాజ్ పాషా, డైరెక్టర్లు కమురుద్దీన్, జహీర్, షారుక్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



## గెహిస్ ఇమ్మిగ్రేషన్, ఇంటర్నేషనల్ లీగల్ సర్వీసెస్ కార్యాలయం ప్రారంభం

**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):**
ఇమ్మిగ్రేషన్ అంతర్జాతీయ చట్టపరమైన విషయాలలో ప్రత్యేకత కలిగిన ప్రముఖ న్యాయ సంస్థ గెహిస్ ఇమ్మిగ్రేషన్, ఇంటర్నేషనల్ లీగల్ సర్వీసెస్, హైదరాబాద్, నాలెడ్జ్ పార్క్ లో కొత్త బ్రాంచ్‌ను అద్దంకి దయాకర్ తెలంగాణ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, సుధా జైన్ సోషలైట్, నరేష్ ఎం గెహి ముఖ్యతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సంక్లిష్ట ఇమ్మిగ్రేషన్, అంతర్జాతీయ చట్టపరమైన సవాళ్లను ప్రతిబింబిస్తూ చేసే వ్యక్తులు, కుటుంబాలు వ్యాపారాలకు వ్యక్తిగతీకరించిన, సమర్థవంతమైన, అత్యాధునిక న్యాయ సేవలను అందించడంలో తమ సంస్థ ముందుంటుందని నిర్వహాకులు అన్నారు. ఈ సందర్భంగా గెహిస్ ఇమ్మిగ్రేషన్, ఇంటర్నేషనల్ లీగల్ సర్వీసెస్ మేనేజింగ్ పార్టనర్ నరేష్ ఎం గెహి మాట్లాడారు. భారత్, అమెరికా మధ్య ఇమ్మిగ్రేషన్ సంబంధిత వ్యవహారాలు, ఇబ్బందులు తొలగించి కుటుంబం, బిజినెస్, వ్యక్తిగతంగా వివిధ రకాల వీసాల సమస్యల పరిష్కారంలో గేహిస్ ఇమ్మిగ్రేషన్ ప్రత్యేకం అన్నారు. భారత్, యునైటెడ్ స్టేట్స్ మధ్య అంతరాన్ని తగ్గించే మ ప్రయాణం గేహిస్ ఇమ్మిగ్రేషన్‌కు ముఖ్యమైన



మైలురాయి, ఎదుగుదల ఆవిష్కరణలు, అవకాశాలు అమెరికాకు అందించడంలో భారతదేశం ఎపుడు అగ్రగామిగా వుంటుంద న్నారు. చదువు, బిజినెస్, గ్రీన్ కార్డ్, వ్యవస్థల బదిలీ, స్పోర్ట్స్ రిలేటెడ్‌కు సంబధిత హెచ్ 1బీ, LIA, Eb5, EB-1C, Eb-1A, P% వంటి పలు రకాల వీసాలు భారత్ అమెరికా దేశాలమధ్య



భవిషత్తు, పురోగతికి మంచి తోడ్పాటునిస్తాయని తెలిపారు. మ్మిగ్రేషన్, అంతర్జాతీయ న్యాయ సేవల కోసం డిమాండ్ పెరుగు తున్నందున, తాము తమ ఖాతాదారులకు అందుబాటులో ఉండ టానికి మరిన్ని ప్రదేశాలలో సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని నరేష్ ఎం గెహి పేర్కొన్నారు.

## త్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులకు అండగా ఉంటాం..

**- రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్**

**చౌటుప్పల్, డిసెంబర్ 27 (వార్త వేదిక సూర్య):**
త్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులకు తాము అండగా ఉంటామని రాజ్యసభ సభ్యుడు, రాష్ట్ర బిజెపి మాజీ అధ్యక్షుడు కే లక్ష్మణ్ తెలిపారు. చౌటుప్పల్ మండల త్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ల ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీ డాక్టర్ కె లక్ష్మణ్ ను హైదరాబాద్ లోని బిజెపి రాష్ట్ర ఆఫీసులో కలిసి త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ ని ఓ ఆర్ ఆర్ నుండి 28 కిలోమీటర్లకు బదులుగా 40 కిలోమీటర్లకు మార్చాలని వినతిపత్రం ఇచ్చారు. ఈ త్రిపుల్ అర్ అలైన్మెంట్ వలన చౌటుప్పల్, భువనగిరి, గజ్వేల్ మున్సిపాలిటీలు రెండు మూడు భాగాలుగా విడిపోతున్నాయని, హెచ్ఎండిఏ పరిధిలో గల ప్లాట్లు, ఇండ్లు కూడా నష్టపోతు న్నామని, గతంలో మా భూములను వివిధ రకాల గవర్నమెంట్ ప్రాజెక్టులకు కోల్పోయామని, ఇప్పుడు మళ్లీ త్రిబుల్ఆర్ అలై న్మెంట్‌లో ఉన్న భూమిని కోల్పోతున్నామని, తమ జీవనోపాధిని కోల్పోయి రోడ్డు మీద పడుతున్నామని విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ మార్పు విషయంలో ఏదో మతలబు ఉందని, గతంలో ప్రియాంక



గాంధీ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి లు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా త్రిబుల్ ఆర్ బాధిత రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, దక్షిణ భాగము లాగా ఉత్తరభాగం కూడా 40కిలోమీటర్లకు మార్చాలని అన్నారు. అలైన్మెంట్ గురించి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితుల ఐక్యవేదిక కన్వీనర్ చింతల దామోదర్ రెడ్డి, నిర్వాసితులు గుజ్జుల సురేందర్ రెడ్డి, దొబ్బటి రాములు గౌడ్, చింతల ప్రభాకర్ రెడ్డి, గుండెబోయిన వేణు యాదవ్, బొమ్మిరెడ్డి ఉపేందర్ రెడ్డి, ఏసిరెడ్డి దామోదర్ రెడ్డి, జాల నరసింహా యాదవ్, జాల వెంకటేష్, గుండెబోయిన గాలయ్య, పంకర్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.






## గొప్ప ఆర్థిక వేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్

### డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు : రాష్ట్ర మున్సిపల్ ఛాంబర్స్ చైర్మన్ రాజు

**చౌటుప్పల్, డిసెంబర్ 27 (వార్త వేదిక సూర్య):**
దేశం డాక్టర్ మన్మోహన్ సింగ్ లాంటి గొప్ప ఆర్థికవేత్తను కోల్పోవడం బాధాకరమని రాష్ట్ర మున్సిపల్ ఛాంబర్స్ చైర్మన్ వెంకట్ రెడ్డి రాజు తెలిపారు. చౌటుప్పల్ పట్టణంలోని రాజీవ్ స్మారక భవనంలో, జాతీయ రహదారిపై కూడలి వద్ద మాజీ ప్రధాని, దివంగత నేత మన్మోహన్ సింగ్ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపంగా నల్ల బ్యాడ్జీలు ధరించి జాతీయ రహదారిపై ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజు మాట్లాడుతూ దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు దేశ ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా అనేక సంస్కరణలను తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి మన్మోహన్ సింగ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎన్నికల ఇన్చార్జి పబ్బు రాజు గౌడ్, జిల్లా మత్స్య సహకార సంఘాల చైర్మన్ పాశం సంజయ్ బాబు, మున్సిపల్ కౌన్సిలర్ కొయ్యడ సైదులు గౌడ్, బ్లాక్, మండల, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, బోయ దేవేందర్, సుర్వి నరసింహ, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, మాజీ సర్పంచ్ కొలను శ్రీనివాస్ రెడ్డి, గుడ్డేటి యాదయ్య, నాయకులు బత్తుల విప్లవ్, బొడిగె బాలకృష్ణ, దేప రాజు, ఊడుగు రమేష్ గౌడ్, జానీ బాబు, యేసు, చెరుకు లింగస్వామి, కంచరకుంట్ల రాంరెడ్డి, మర్రి మల్లికార్జున్ రెడ్డి, బొబ్బిళ్ళ మురళి తదితరులు పాల్గొన్నారు.

**బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో**

చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా ఎన్నో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించిన మహనీయులని కొనియాడారు. ఆయన మౌనమునిగా ఎలాంటి హంగులు ఆర్భాటాలు లేకుండా నిరాడంబరంగా, నిజాయితీగా ఈ దేశానికి సేవ చేశారని కీర్తించారు. ఆయన హయాంలోనే ప్రభుత్వాలు అత్యంత పారదర్శకత, జవాబు దారితనం ఉండాలని సమాచార హక్కు చట్టం తెచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ జెల్లా రమేష్, కోశాధికారి పడమటి మహిపాల్ రెడ్డి, లేడీ రిప్రజెంటేటివ్ పల్లి స్వాతి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ జక్కర్తి శేఖర్, సీనియర్ న్యాయవాదులు ఎలమోని శ్రీనివాస్, బాల్య వెంకటాచలం, రాధాకిషన్ రావు, కానుగుల వెంకటయ్య, పి బిక్షమయ్య, ఎండి ఖయ్యూం, చామట్ల జంగయ్య, గర్దాసు రాఘవేందర్, పిట్టల భరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను:
వార్త వేదిక సూర్య దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని అన్ని జిల్లాల బ్యూరో, స్టాఫ్ రిపోర్టర్స్ మరియు నియోజక వర్గాల నుండి పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును
పూర్తి వివరాలకు సంప్రదించగలరు.
పోలోజు శ్రీనివాసాచారి
చైర్మన్ & ఎడిటర్.
9985389183

క్లాసిఫైడ్స్
వార్త వేదిక సూర్య తెలుగు దినపత్రికలో ప్రకటనల కొరకు ఈ నంబర్‌లో
99853 89183
సంప్రదించండి..







మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో ఉద్యోగులు ఏవరైనా రిటైర్డ్ అవుతున్నారా ! అయితే వారికి మీరు శుభాకాంక్షలు తెలుపాలనుకుంటున్నారా
మా వార్త వేదిక సూర్య దినపత్రిక ద్వారా తెలియజేయగలరు.



## 'ఓ భామ అయ్యో రామా'
# చిత్ర గ్లిమ్స్

సాధారణంగా లవ్ రొమాంటిక్ కామెడీ సినిమాలను అందరం ఇష్టపడుతుంటాము. ఇప్పుడు అదే తరహాలో సుహాస్ హీరోగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం ఓ భామ అయ్యో రామ. అందరిని నవ్వించే వినోదమైన యువకుడి చుట్టూ తిరిగే ఓ కథగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. రామ్ గోదాల దర్శకత్వంలో సుహాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో మాళవిక మనోజ్ తనకు జంటగా నటిస్తున్నారు. ఇక ఈ చిత్ర గ్లింప్స్ వీడియో విషయానికి వస్తే ఈ చిత్రంలోని హీరో హీరోయిన్ ఒక కారులో ఒకరిని ఒకరు టీస్ చేసుకుంటూ సరదాగా ఉన్న సమయంలో కార్ బ్రేకులు పనిచేయక ఆ పరిస్థితి మారిపోయి మరో దిశగా పరిస్థితులు వెళ్తుంటాయి. వి ఆర్ట్స్ బ్యానర్ పై హరీష్ నల్ల నిర్మాతగా గొప్ప నిర్మాణ విలువలతో రానున్న ఈ చిత్రానికి నువ్వు నేను చిత్ర నటి అయిన అనిత హస్సనందిని చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. చిత్రంలో కామెడీ పండించడానికి ప్రభాస్ శ్రీను, ఆలీ నటిస్తుండగా ఇటీవల యానిమల్ సినిమాలో కనిపించను నటుడు బబ్లు పృథ్వీరాజ్ ఈ చిత్రంలో మంచి పాత్ర పోషిస్తున్నారు.



## మనం ఏదైనా చేయగలం : సమంత

కష్టతర సమయాల్లో ఎలా ఉండాలో కొంతమంది సెలబ్రిటీలను చూసి నేర్చుకోవచ్చు. అలాంటి వారి జాబితాలో టాప్‌లో ఉంటుంది చెన్నై సుందరి సమంత. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ఈ భామ ఎప్పటికప్పుడు ఏదో ఒక పోస్ట్‌తో ఫాలోవర్లు, అభిమానుల్లో జోష్ నింపుతూంటుంది. తాజాగా ఉదయాన్నే మోటివేషన్ క్లాసులు చెబుతోంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్ట్ నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. మార్నింగ్ మోటివేషన్.. మనం చేయగలం సామ్ మీ కలలను ఫాలో అవండి.. వాటికి మార్గం తెలుసు.. కొటేషన్‌ను హైలెట్ చేస్తూ.. బహుశా చూస్తూ కూర్చోవడం మంచిది. లేదంటే కాసేపు వేచి ఉండవచ్చు. బిజీ ప్రపంచంలో మీకు కావలసిందల్లా సాధారణ జీవితం. ప్రణాళిక లేకపోవడమనేది కూడా ప్రణాళికలో భాగమే కావచ్చు.. చక్కర్లు కొట్టడానికి.. హ్యాపీ హాలీడేస్ అంటూ క్యాప్షన్ ఇచ్చింది. సమంత ఓ వైపు బెడ్‌పై దుప్పటి కప్పుకొని హాయిగా నిద్రపోతున్న స్టిల్.. మరోవైపు వర్కవుట్ స్టిల్‌ను షేర్ చేయగా.. ఇప్పుడీ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గతేడాది శాకుంతలం, ఖుషి సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చింది సామ్. ఆ తర్వాత హిందీలో వరుణ్ ధవన్‌తో సిటడెల్ వెబ్‌సిరీస్‌లో నటించింది. ఈ ప్రాజెక్టు తర్వాత సామ్ నుంచి కొత్త సినిమా ప్రకటన రావాల్సి ఉంది.

## మన్మోహన్ పాత్రను రిజెక్ట్ చేయాలనుకున్నా : అనుపమ్‌ఖేర్

మన్మోహన్‌సింగ్ మృతిపై రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు ప్రముఖులు, రాజకీయవేత్తలు సంతాపం వ్యక్తంచేశారు. తాజాగా నటుడు అనుపమ్ ఖేర్ కూడా మన్మోహన్ గుర్తు చేసుకుంటూ నివాళులు అర్పించాడు. ఈ క్రమంలోనే మన్మోహన్‌సింగ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'ను బాలీవుడ్ సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్ గుర్తుచేసుకున్నారు. ఈ సినిమాలో మన్మోహన్ పాత్రలో నటించాడు అనుపమ్ ఖేర్. మన్మోహన్ సింగ్ చాలా తెలివైన వ్యక్తి. ఎంతో నిజాయతీపరుడు, గొప్ప నాయకుడు. ఆయనను కలిసే అవకాశం నాకు రెండు సార్లు వచ్చింది. అయితే ఆయన జీవిత ఆధారంగా తెరకెక్కిన 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' సినిమాలో నేను మన్మోహన్ పాత్రలో నటించాను. మొదట ఈ సినిమా కోసం చిత్రబృందం నన్ను సంప్రదించినప్పుడు నేను ఒప్పుకోలేదు. నా పర్సనల్ కారణాలతో పాటు రాజకీయ ఒత్తిడులకు తలవంచి ఈ ప్రాజెక్ట్‌ను వదిలేద్దమనుకున్నాను. కానీ ఒక గొప్ప వ్యక్తి జీవిత చరిత్రలో నటించే అవకాశం అందరికి రాదని ఈ సినిమాను అంగీకరించాను. నేను చేసిన గొప్ప సినిమాల్లో ఇదొకటి. ఆ చిత్రం వివాదాస్పదం అయ్యి ఉండవచ్చు.. కానీ ఆయన మాత్రం వివాదాలు లేనివాడు అంటూ అనుపమ్ చెప్పుకోచ్చాడు. అనుపమ్ ఖేర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'. ఈ సినిమాకు విజయ్ గుట్టే దర్శకత్వం వహించగా.. సంజయ్ బారు రచించిన 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్: ది మేకింగ్ అండ్ అన్ మేకింగ్ ఆఫ్ మన్మోహన్ సింగ్' అనే నవళ ఆధారంగా ఈ సినిమా వచ్చింది. 2019లో విడుదలైన ఈ చిత్రం తీవ్ర విమర్శలను ఎదుర్కోంది. మన్మోహన్ సింగ్ కూడా ఈ సినిమాపై స్పందిస్తూ.. ఇందులో చెప్పినవన్ని అబద్దాలు అంటు చెప్పుకోచ్చాడు.




## వీరమల్లులో పాటపాడిన పవన్

టాలీవుడ్ యాక్టర్ పవన్ కల్యాణ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ హరిహరవీరమల్లు. పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రానికి జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీలో ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీ రెండు పార్టులుగా రానుండగా.. హరిహర వీరమల్లు పార్ట్ 1 మార్చి 28న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. కాగా న్యూ ఇయర్ కానుకగా మేకర్స్ ఏదైనా అప్‌డేట్ అందిస్తారేమోనని చూస్తున్న అభిమానులు, మూవీ లవర్స్ కోసం అదిరిపోయే వార్త నెట్టింట వైరల్ అవుతోంది.

హరిహరవీరమల్లు ఫస్ట్ సింగిల్‌ను జనవరి 1న మధ్యాహ్నం 12 గంటలకు లాంచ్ చేయబోతున్నారని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు ఈ పాటను పవన్ కల్యాణ్ పాడటం విశేషం. తెలుగుతోపాటు మిగిలిన భాషల్లో కూడా పవన్ కల్యాణ్ వాయిస్‌తో పాట ఉండబోతుందట. ఇప్పటికే పవన్ కల్యాణ్ పాడిన పాటలు సూపర్ హిట్‌గా నిలువడమే కాదు.. బాక్సాఫీస్ వద్ద సూపర్ హైప్ క్రియేట్ చేశాయి. మరి పీరియాడిక్ డ్రామాకు స్టార్ యాక్టర్ వాయిస్ ఎలాంటి బజ్ క్రియేట్ చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ మూవీలో బాలీవుడ్ నటుడు, దర్శక నిర్మాత అనుపమ్ ఖేర్, అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రి కీలక పాత్రలు పోషిస్తున్నారు.



లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. క్లైమాక్స్‌లో వచ్చే రెడ్ డ్రెస్ ఫైట్‌ను 42 రోజులపాటు చిత్రీకరించినట్టు ఇప్పటికే వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. ఇక ఇంట్రో సాంగ్, టైగర్ ఫైట్, మహల్ యాక్షన్ పార్ట్, కుస్తీ ఫైట్ సీన్, చార్మినార్ యాక్షన్ ..

## రెండు పార్ట్‌లుగా విజయ్ దేవరకొండ గౌతమ్ తిన్ననూరి ప్రాజెక్టు

టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ, జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్ లో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. 'వీడీ12' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్ రానుండగా విజయ్ దేవరకొండ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తెరకెక్కుతుంది. సితార ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. అయితే ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు నిర్మాత నాగవంశీ. ఆయన మాట్లాడుతూ.. వీడీ12 ప్రాజెక్ట్ రెండు పార్టులుగా రాబోతుందని ప్రకటించాడు. ఈ ఆలోచన సినిమా తీస్తున్న టైంలో రాలేదని.. షూటింగ్ స్టార్ట్ అవ్వకముందే ఈ ఆలోచన వచ్చినట్లు తెలిపాడు. అయితే ఈ రెండు పార్టులలో రెండు వేరు వేరు కథలు ఉంటాయని నాగవంశీ చెప్పుకోచ్చాడు. మరోవైపు ఈ సినిమాను వచ్చే ఏడాది మార్చిలో తీసుకురావడానికి ప్లాన్ చేస్తున్నట్లు తెలిపాడు. ఒకవేళ ఆ టైంలో పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు ఉంటే తమ సినిమాను వాయిదా వేయనునట్లు చెప్పుకోచ్చాడు.



స్పోర్ట్స్ | SPORTS



# కష్టాల్లో టీమ్‌ఇండియా

**మళ్లీ ఆటగాళ్ళ అదే తడబాటు**

**5 వికెట్ల నష్టానికి 164 పరుగులు**

**474 పరుగుల భారీ స్కోర్ చేసిన ఆసిస్**

**భారీ శతకంతో చెలరేగిన స్టీవ్ స్మిత్**

**భారత్‌కు పొంచి ఉన్న ఫాలో ఆన్ గండం**

మెల్‌బోర్న్ టెస్టులో టీమ్‌ఇండియా కష్టాల్లో పడింది. రెండో రోజు ఆట ముగిసేసరికి భారత్ 310 పరుగుల వెనుకంజలో కొనసాగుతోంది. భారత్ ఫాలో ఆన్ గండం తప్పించుకోవాలంటే మరో 111 పరుగులు చేయాలి. తొలి ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా 5 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. క్రీజులో రిషభ్ పంత్ (6), రవీంద్ర జడేజా (4) ఉన్నారు. ఆసీస్ బౌలర్లలో ప్యాట్ కమిన్స్, స్కాట్ బోలాండ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. రెండో రోజు తొలి సెషన్‌లోనే టీమ్‌ఇండియా మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించింది. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (82 పరుగులు) హాఫ్ సెంచరీతో రాణించినా, కెప్టెన్ రోహిత్ శర్మ (3) మరోసారి తడబడ్డాడు. కేఎల్ రాహుల్ (24) కాసేపు ఆకట్టుకున్నా ఇన్నింగ్స్‌ను భారీ స్కోర్‌గా మలచలేకపోయాడు. అయితే జైస్వాల్- విరాట్ మాత్రం క్రీజులో కుదురుకుపోయారు. వీరిద్దరూ ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. మూడో వికెట్‌కు ఈ జోడీ 102 పరుగులు జోడించింది. దీంతో భారత్ రెండు వికెట్ల నష్టానికే 150 పరుగుల మార్క్ అందుకుంది.

కానీ, అక్కడే కథ మలుపు తిరిగింది. 41వ ఓవర్లో జైస్వాల్ రనౌట్ అయ్యాడు. దీంతో సెంచరీ భాగస్వామ్యం బ్రేక్ అయ్యింది. కొద్దిసేపటికే క్రీజులో పాతుకుపోయిన విరాట్ కూడా ఔటయ్యాడు. తర్వాత వరుస వికెట్లు పడుతున్న క్రమంలో నైట్‌వాచ్‌మెన్‌గా ఆకాశ్ దీప్ (0)ను బరిలో దింపినా అతడు కూడా పెవిలియన్ చేరాడు. దీంతో టీమ్‌ఇండియా 6 పరుగుల వ్యవధిలో ఐదు వికెట్లు కోల్పోయింది. అంతకుముందు 311/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 474 పరుగుల భారీ స్కోర్ చేసింది. స్టీవ్ స్మిత్(197 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్స్‌లతో 140) భారీ శతకంతో చెలరేగగా.. సామ్ కోన్‌స్టాస్(65 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 60), ఉస్మాన్ ఖవాజా(121 బంతుల్లో 6 ఫోర్లతో 57), మార్నస్ లబుషేన్(145 బంతుల్లో 7 ఫోర్లతో 72)హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా నాలుగు వికెట్లు తీయగా, రవీంద్ర జడేజా మూడు వికెట్లు పడగొట్టాడు. ఆకాశ్ దీప్‌కు రెండు వికెట్లు దక్కగా.. వాషింగ్టన్ సుందర్ ఒక వికెట్ తీసాడు. మహమ్మద్ సిరాజ్ ఒక్క వికెట్ కూడా తీయలేదు. కానీ ధారళంగా పరుగు లిచ్చు కున్నాడు. 23 ఓవర్లు బౌలింగ్ చేసిన సిరాజ్ 5.30 ఎకానమీతో 122 పరుగులిచ్చు కున్నాడు. అతని కెరీర్‌లోనే ఇది అత్యంత చెత్త రికార్డ్. సిరాజ్ వైఫల్యం ఆసీస్‌కు కలిసొచ్చింది.



311/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఆసీస్.. స్మిత్ సెంచరీతో తమ ఆధిపత్యం కొనసాగించింది. 68 పరుగుల వ్యక్తిగత ఓవర్‌నైట్ స్కోర్‌తో బరిలోకి దిగిన స్మిత్.. 167 బంతుల్లో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అతనికి మరో ఎండ్‌లో కెప్టెన్ ప్యాట్ కమిన్స్ సహకారం అందించాడు. ఈ ఇద్దరూ భారత బౌలర్లను చెడుగుడు ఆడారు. వీలు చిక్కిన బంతిని బౌండరీకి తరలించారు. తొలి సెషన్ చివర్లో హాఫ్ సెంచరీకి చేరువైన ప్యాట్ కమిన్స్(49)ను జడేజా.. నితీష్ కుమార్ రెడ్డి స్టన్నింగ్ క్యాచ్‌తో పెవిలియన్ చేర్చాడు. దాంతో ఏడో వికెట్‌కు నమోదైన 112 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి మిచెల్ స్టార్క్ రాగా.. మరో వికెట్ పడకుండా స్మిత్ జాగ్రత్తగా ఆడాడు. దాంతో ఆసీస్ 454/7 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే మిచెల్ స్టార్క్(15)ను జడేజా క్లీన్ బౌల్డ్ చేయగా.. ఆ మరుసటి ఓవర్‌లోనే స్టీవ్ స్మిత్ విచిత్రకర రీతిలో పెవిలియన్ చేరాడు. కాగా ఆకాశ్ దీప్ బౌలింగ్‌లో స్టెప్ ఔటై స్మిత్ ఆఫ్ సైడ్ ఆడే ప్రయత్నం చేశాడు. కానీ బ్యాట్ ఎడ్జ్ తాకిన బంతి అతని ప్యాడ్స్‌ను తాకి మెల్లిగా లెగ్ స్టంప్ బెయిల్‌ను కిందపడేసింది. నిస్స హాయంగా స్మిత్ చూస్తూ నిలబడిపోయాడు. నిరాశగా పెవిలియన్ చేరాడు. అసాధారణ బ్యాటింగ్ చేసిన స్టీవ్ స్మిత్‌కు మెల్ బోర్న్ ప్రేక్ష కులు స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కూడా స్మిత్‌ను అభి నందించాడు. స్కాట్ బోలాండ్, నాథన్ లయన్ కాసేపు భారత బౌలర్లను విసిగించారు. జడేజా, సిరాజ్ బౌలర్లను ధీటుగా ఎదుర్కొన్నారు. దాంతో రోహిత్ బుమ్రాను రంగంలోకి దింపగా అతను నాథన్ లయన్‌ను ఎల్బీగా పెవిలియన్ చేర్చి ఆసీస్ ఇన్నింగ్స్ తెరదించాడు.

## రోహిత్ శర్మ కెప్టెన్సీ, గంభీర్ వ్యూహాలు సరిగ్గా లేవు

**నాలుగో టెస్ట్‌లో టీమిండియా బౌలర్లు తేలిపోయారు**

**వాషింగ్టన్ సుందర్ తుది జట్టులోకి ఎందుకు**

**భారత బౌలింగ్ ప్రదర్శనపై రవి శాస్త్రి అసంతృప్తి**



టీమిండియా మేనేజ్‌మెంట్ నిర్ణయాలపై మాజీ హెడ్ కోచ్, కామెంటేటర్ రవి శాస్త్రి ఆగ్రహం వ్యక్తం చేశాడు. రోహిత్ శర్మ కెప్టెన్సీ, గంభీర్ వ్యూహాలు సరిగ్గా లేవని విమర్శించాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో మెల్ బోర్న్ వేదికగా జరుగుతున్న నాలుగో టెస్ట్‌లో టీమిండియా బౌలర్లు తేలిపోయారు. దాంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 474 పరుగుల భారీ స్కోర్ చేసింది. స్టీవ్ స్మిత్(197 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్స్‌లతో 140) భారీ శతకంతో చెలరేగగా..సామ్ కోన్‌స్టాస్(65 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 60), ఉస్మాన్ ఖవాజా(121 బంతుల్లో 6 ఫోర్లతో 57), మార్నస్ లబుషేన్(145 బంతుల్లో 7 ఫోర్లతో 72)హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా నాలుగు వికెట్లు తీయగా, రవీంద్ర జడేజా మూడు వికెట్లు పడగొట్టాడు. ఆకాశ్ దీప్‌కు రెండు వికెట్లు దక్కగా.. వాషింగ్టన్ సుందర్ ఒక వికెట్ తీసాడు. మహమ్మద్ సిరాజ్ ఒక్క వికెట్ కూడా తీయలేదు. ఈ మ్యాచ్‌కు కామెంటేటర్‌గా వ్యవహరిస్తున్న రవి శాస్త్రి.. బ్రేక్ సమయంలో భారత బౌలింగ్ ప్రదర్శనపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఎక్స్‌ట్రా స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌తో బౌలింగ్ చేయించకపోవడాన్ని తప్పుబట్టాడు. రోహిత్ శర్మ కెప్టెన్సీ.. గంభీర్ వ్యూహాలు చెత్తగా ఉన్నాయని ఘాటుగా విమర్శించాడు. నమ్మకం లేనప్పుడు వాషింగ్టన్ సుందర్‌ను తుది జట్టులోకి ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించాడు.'భారత బౌలింగ్ చెత్తగా ఉంది. టీమిండియా మేనేజ్‌మెంట్ వద్ద సరైన వ్యూహాలు లేవు. స్పిన్నర్లను వాడుకోవాల్సిన రీతిలో ఉపయోగించలేదు. జడేజా బంతి అందుకునే ముందు 40 ఓవర్ల గ్యాప్ ఉంది. వాషింగ్టన్ సుందర్ తొలి ఓవర్ వేసేందుకు కూడా చాలా సమయం పట్టింది. మరి ఎందుకు ఇద్దరు స్పిన్నర్లను తీసుకున్నారు. వారిపై నమ్మకం లేనప్పుడు వారిని తుది జట్టులోకి తీసుకోవడం ఎందుకు'అని రవి శాస్త్రి ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ మ్యాచ్‌లో రవీంద్ర జడేజా 23 ఓవర్లు బౌలింగ్ చేసి మూడు వికెట్లు తీయగా.. వాషింగ్టన్ సుందర్ 15 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేసి ఓ వికెట్ మాత్రమే తీసాడు

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**,and **Printed at SURYA DIGITAL PRINTERS,** H.No.1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI. Title-Code:- TELTEL12333,** Cell:9985389183. **Email Id:vaarthavedhikasurya.yadadri@gmail.com**